మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...


నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక


మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..


శనివారం SATURDAY 15-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 136 Issue: 136

15 నవంబర్ 2025 - శనివారం, శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం - శరత్ ఋతువు, కార్తీక మాసం - కృష్ణపక్షం, సూర్యోదయం - ఉ. 6:24, సూర్యాస్తమయం - సా. 5:36, తిథి. ఏకాదశి రా. 2:38 వరకు, తరువాత ద్వాదశి, సంస్కృత వారం, స్థిర వాసరః, నక్షత్రం, ఉత్తర ఫల్గుని(ఉత్తర) రా. 11:31 వరకు, తరువాత హస్త, యోగం, 30:350 వరకు, కరణం, బవ మ. 1:42 వరకు, భాలవ రా. 2:380 వరకు, వర్జ్యం, తె. 5:12 నుండి ఉ. 6:57 వరకు, దుర్ముహూర్తం, ఉ. 7:54 నుండి ఉ. 8:39 వరకు, రాహుకాలం, ఉ. 9:12 నుండి ఉ. 10:36 వరకు, యమగండం, మ. 1:24 నుండి మ. 2:48 వరకు, గుళికాకాలం, ఉ. 6:24 నుండి ఉ. 7:48 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:48 నుండి తె. 5:36 వరకు, అమృత ఘడియలు, మ. 3:40 నుండి సా. 5:25 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:38 నుండి మ. 12:23 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published From Jagitial
www.evarthalu.com


జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపొందారు. ఎన్నికల అధికారులు నవీన్ యాదవ్ గెలుపుని అధికారికంగా ప్రకటించారు. ఉదయం 8 గంటలకు ఉప ఎన్నిక కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఆధిక్యంలో కొనసాగారు.



# జూబ్లీహిల్స్‌లో నవీన్

### ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు.. బీఆర్ఎస్ అభ్యర్థిపై 24,729 ఓట్ల మెజార్టీ
### ప్రతి రౌండ్‌లోనూ నవీన్ యాదవ్ ముందంజ.. డిపాజిట్ కోల్పోయిన బీజేపీ అభ్యర్థి

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): మొదటి రెండు రౌండ్లు కాంగ్రెస్ ముందంజలో ఉండగా, మూడో రౌండ్‌లో బీఆర్ఎస్ స్వల్ప ఆధిక్యం సాధించింది. ఆ తర్వాత ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ముందంజలో ఉన్నారు. కౌంటింగ్ మొత్తం పది రౌండ్లు జరగ్గా, అందులో తొమ్మిది రౌండ్లలో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. మొత్తంగా లెక్కించిన 1,94,631 ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,945, బీఆర్ఎస్ అభ్యర్థి 74,234 ఓట్లు రాగా.. బీజేపీ అభ్యర్థి(17,041) డిపాజిట్ కోల్పోయారు. నోటాకు 924 ఓట్లు పడ్డాయి. రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్న తర్వాత నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ప్రజలు నమ్మకంతో తనను గెలిపించారని

- తరువాయి 2 వ పేజీలో...



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. 243 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 203 సీట్లను కైవసం చేసుకున్న ఎన్డీయే, డబుల్ సెంచరీ మైలురాయిని దాటింది. ఈ భారీ విజయంతో బీహార్‌లో మరోసారి డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ ఎన్నికల్లో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ (యునైటెడ్) 85 సీట్లతో అద్భుతమైన పునరాగమనం చేసింది.

# బీహార్‌లో ఎవిన్‌డీఏ

### 243 స్థానాలకు 203 సీట్లను కైవసం చేసుకున్న కూటమి
### ఎన్డీఏ కూటమికే ప్రజల పట్టం.. గతంలో కంటే రెట్టింపు సీట్లు సాధించిన జేడీయూ
### 34 స్థానాలకే పరిమితమైన మహాగఠ్‌బంధన్.. ఘోరంగా దెబ్బతిన్న ఆర్జేడీ, కాంగ్రెస్

2020 ఎన్నికల్లో కేవలం 43 సీట్లు మాత్రమే గెలిచిన జేడీయూ, ఈసారి రెట్టింపు స్థానాలు దక్కించుకోవడం విశేషం. కూటమిలోని ఇతర పక్షాలైన ఎల్‌జేపీ (ఆర్‌వీ) 19, హెచ్ఏఎం 5, ఆర్ఎల్ఎం 4 స్థానాల్లో విజయం సాధించాయి. ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధరీ, విజయ్ కుమార్ సిన్హా సహా గాయని మైథిలీ ఠాకూర్, శ్రేయసి సింగ్ వంటి ప్రముఖులు గెలుపొందారు. మరోవైపు, ప్రతిపక్ష మహాగఠబంధన్ ఈ ఎన్నికల్లో

- తరువాయి 2 వ పేజీలో...

## 9999 నెంబర్‌కు 22.72 లక్షలు

ఖైరతాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): ఖైరతాబాద్ రవాణా శాఖ నిర్వహించిన ఫ్యాన్సీ నెంబర్ల వేలంలో రూ. 65.38 లక్షలు ఆదాయం సమకూరింది. ఈమేరకు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సీ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఆల్‌టైమ్ ఫ్యాన్సీ నెంబర్ 9999 ఏకంగా రూ. 22,72,000 ధర పలికింది. మరో నెంబర్ 0009 రూ. 68,000కు అమ్ముడుపోయింది. వీటితో పాటు మరికొన్ని ఫ్యాన్సీ నెంబర్లకు భారీ ధర వెచ్చించి వాహనదారులు కొనుగోలు చేసినట్లు రమేష్ వెల్లడించారు.

## బీఆర్ఎస్ కనుమరుగే

### కేటీఆర్‌కు అహంకారం, హరీశ్‌కు అసూయ
### వారిద్దరు వాటిని తగ్గించుకుంటే మంచిది
### మా పాలనకు జూబ్లీహిల్స్ ఫలితం గీటురాయి
### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సెక్రటేరియట్‌కు రావాలి
### జూబ్లీహిల్స్ రిజల్ట్ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): ప్రతిపక్ష బీఆర్ఎస్ కీలక నేతలైన కేటీఆర్, హరీష్ రావులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన తర్వాత.. ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అహంకారం, హరీశ్ రావుకు అసూయ ఎక్కువగా ఉన్నాయని.. వాటిని తగ్గించుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'అసెంబ్లీ ఎన్నికల్లో

- తరువాయి 2 వ పేజీలో...





# ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే

### జూబ్లీహిల్స్ ఫలితంతో ఇదే రుజువైంది
### ఒక్క ఉపఎన్నిక తోనే కాంగ్రెస్ తడబాటు
### రాబోయే రోజుల్లో ప్రతిపక్షంగా మా పని మేం చేసుకుంటూపోతాం
### బీఆర్ఎస్ ఎప్పటికీ వెనక్కి తగ్గదు
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్‌కు ఓటేసిన ప్రజలకు ధన్యవాదాలు. బీఆర్ఎస్ గెలుస్తుందని సర్వేలన్నీ చెప్పాయి. చివరి మూడు రోజులు ఏం జరిగిందో అందరికీ తెలుసు. బైపోల్ మాకు కొత్త బలాన్ని ఇచ్చింది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీఆర్ఎస్సే.

- తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,704 |
| వెండి (గ్రాము): | రూ.183.10 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,558 |



## బీజేపీ డిపాజిట్ గల్లంతు

### కమలం పార్టీ అభ్యర్థికి కేవలం 17,061 ఓట్లే
### నిరుత్సాహంలో కమలం పార్టీ శ్రేణులు
### అక్కడ మేమెప్పుడూ గెలవలేదు: కిషన్ రెడ్డి

ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించారు.అందరూ ఊహించినట్లే కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధానంగా పోటీ సాగింది.

ఏ దశలోనూ బీజేపీ పోటీ ఇవ్వలేకపోయింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి అనూహ్యంగా డిపాజిట్ కోల్పోవడం గమనార్హం.ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి కేవలం 17,061 ఓట్లు వచ్చాయి. బీహార్ లో ఎన్డీఏ ఘనవిజయం దిశగా దూసుకుపోతుంది. అయితే జూబ్లీహిల్స్ ఫలితాలతో తెలంగాణ బీజేపీలో ఆ జోష్ కనిపించడంలేదు. బీజేపీ కేడర్ నిరుత్సాహంలో ఉన్నట్లు తెలుస్తోంది. కనీసం డిపాజిట్ వస్తుందని బీజేపీ కార్యకర్తలు భావించారు. కానీ డిపాజిట్ గల్లంతు అవ్వడంతో సంబరాలకు

- తరువాయి 2 వ పేజీలో...

## రాహుల్, కేటీఆర్ ఐరన్ లెగ్స్

### బండి సంజయ్ సంచలన ఆరోపణలు

జూబ్లీహిల్స్, బీహార్ ఎన్నికల ఫలితాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లో కాంగ్రెస్ పార్టీ ఒక ప్రాంతీయపార్టీగా మారిపోయిందని, తెలంగాణలో బీఆర్ఎస్ ఉపప్రాంతీయ పార్టీగా మారిందని సెటైర్లు వేశారు.



కరీనంగర్, నవంబర్ 14 (ఈవార్తలు): రాహుల్ గాంధీలు, కేటీఆర్ లు ఇద్దరు కూడా ఐరన్స్ లెగ్స్ లా మారారని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ ఇక పబ్జీగేమ్ కు పరిమితమని అన్నారు. ఇక బీహార్ లో తమ సత్తాచాటమని, ఇక వెస్ట్ బెంగాల్ తమ టార్గెట్ అన్నారు. హిందువులందరిని ఏకం చేసి కాంగ్రెస్ ను ఓడిస్తామన్నారు. ఇక తెలంగాణలో జరిగే లోకల్ బాడీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. కంటోన్మెంట్, జూబ్లిహిల్స్ అసెంబ్లీ సిట్టింగ్ స్థానాలను బీఆర్ఎస్ కోల్పోయిన కూడా తాము మాత్రమే ప్రత్యామ్నాయమని చెప్పడం హస్యాస్పదమన్నారు. బీహార్ఎన్నికల్లో నరేంద్ర మోదీ నాయకత్వంకు ప్రజలు భారీగా ఆదరించాన్నారు. ఎన్నికుట్రలు చేసిన, ఎంతగా తప్పుడు ప్రచారంచేసిన అమలు కానీ హామీలు ఇచ్చిన ప్రజలు ఎన్డీయే కూటమికే పట్టంకట్టారన్నారు. మరోవైపు జూబ్లిహిల్స్ లో మాత్రం మైనారిటీలంతా ఏకమై కాంగ్రెస్ ను గెలిపించుకున్నాయన్నారు. ఇక దేశంలోనిహిందు సమాజం ఒక్కటవ్వాల్సిన సమయం ఆసన్నమైందని, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదామన్నారు. కాంగ్రెస్ పార్టీ 60 స్థానాల్లో పోటీ చేస్తే 5 సీట్లకే పరిమితమవ్వడం ఆ జాతీయ పార్టీ ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోయిందని చెప్పడానికి నిదర్శనమన్నారు. బీహార్‌లో జరిగిందే.. వెస్ట్ బెంగాల్ లో కూడా రిపీట్ అవుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ జోస్యం చెప్పారు. మాట మాట్లాడితే..

- తరువాయి 2 వ పేజీలో...



## కర్మ హిట్స్ బ్యాక్

### కల్వకుంట్ల కవిత సంచలన ట్వీట్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక ఫలితం వెలువడిన వెంటనే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఉప ఎన్నిక ఫలితం అధికారికంగా కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చిన వెంటనే.. ఆమె 'కర్మ హిట్స్ బ్యాక్' అంటూ ట్వీట్ చేశారు.

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): ఈ ట్వీట్ సాధారణ స్పందన కాదని.. బీఆర్ఎస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై కవిత చేసిన సంచలన వ్యాఖ్యగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత చేసిన పోస్ట్, బీఆర్ఎస్ పార్టీలోని ఒక వర్గానికి, ముఖ్యంగా పార్టీలో తమకు తగిన గౌరవం దక్కలేదని భావిస్తున్న కవిత వర్గానికి మధ్య నెలకొన్న అంతర్గత విభేదాలకు అద్దం పడుతున్నట్లు తెలుస్తోంది. కవిత 'కర్మ' ప్రస్తావన ద్వారా.. పార్టీలో జరుగుతున్న కొన్ని తప్పుడు నిర్ణయాలు.. అనైతిక రాజకీయాల పర్యవసానమే ఈ ఓటమని సూచించినట్లుగా ఉంది. పార్టీలో కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని ఆమె పరోక్షంగా ఈ ట్వీట్ ద్వారా పార్టీ అధిష్టానానికి, కేసీఆర్‌కు సంకేతం పంపినట్లుగా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కవిత తన రాజకీయ ప్రయాణంలో ఎదుర్కొన్న అంతర్గత ఒడిదుడుకులకు.. ఈ జూబ్లీహిల్స్ ఓటమి ఒక రకంగా తమ ప్రత్యర్థులకు తగిన జవాబు

- తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



నేషనల్ హెల్త్ సర్వీస్ ద్వారా క్యాన్సర్ పేషెంట్లకు ఇమ్యూనోథెరపీ వ్యాక్సిన్ అందజేస్తున్న తొలి యూరప్ దేశంగా ఇంగ్లండ్ నిలిచింది. ఈ వ్యాక్సిన్ ద్వారా రోగనిరోధక వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని క్యాన్సర్ సెల్స్‌ను నాశనం చేసేదే ఈ చికిత్స.

## రాశి ఫలాలు

15-11-2025

మేషం: వ్యాపార, ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి. పనులు సకాలంలో పూర్తి అవుతాయి. ఆర్థిక పురోగతి సాధిస్తారు. ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. పాత రుణాలు తీర్చగలుగుతారు. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు.

వృషభం: స్వల్ప అనారోగ్యం సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనుల్లో జాప్యం తప్పదు. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇంటాబయట గందరగోళ పరిస్థితులుంటాయి.

మిధునం: ముఖ్యమైన పనులు వ్యయప్రయాసలతో కానీ పూర్తికావు. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. వ్యాపారాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు శ్రమ తప్పదు. మాతృ సంభంధిత అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. బంధువర్గంతో చిన్నపాటి వివాదాలు ఉంటాయి.

కర్కాటకం: విలువైన గృహోపకరణాలు బహుమతులుగా పొందుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చూడతారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. సోదరుల నుండి శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశములు అందుతాయి.

సింహం: ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ధనపరంగా ఇబ్బందులు తప్పవు. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపార, ఉద్యోగాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. కుటుంబ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

కన్య: వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. భూవివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. ఉద్యోగులకు పదోన్నతులు పెరుగుతాయి. బంధు మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి.

తుల: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో శ్రమకు తగ్గ ఫలితం కనిపించదు. కుటుంబసభ్యులతో వివాదాలు ఉంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. ఆస్తి వివాదాలు కొంత చికాకు పరుస్తాయి. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు కలసిరావు.

వృశ్చికం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో మీ అంచనాలు నిజం కాగలవు. ఆర్థిక విషయాలు సంతృప్తినిస్తాయి. సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు రాగలవు. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: స్థిరస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానానికి విద్యా ఉద్యోగ అవకాశములు అందుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. మిత్రులతో విందు వినోద కార్యక్రమాలకు హాజరువుతారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

మకరం: దూరప్రయాణాలు వలన శారీరక శ్రమ పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో అకారణ వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలు ముందుకు సాగవు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చేస్తారు.

కుంభం: కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక ఇబ్బందులు కొంత చికాకు పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు పెరుగుతాయి. నూతన రుణయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి.

మీనం: ఆలయ దర్శనాలు చేసుకుంటారు. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో సమస్యలు అధిగమిస్తారు. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఇతరులతో వివాదాల పరిష్కారం అవుతాయి.

# బీహార్‌లో ఎ(వి)న్‌డీఏ



మొదటి పేజీ తరువాయి

2020 ఎన్నికల్లో కేవలం 43 సీట్లు మాత్రమే గెలిచిన జేడీయూ, ఈసారి రెట్టింపు స్థానాలు దక్కించుకోవడం విశేషం. కూటమిలోని ఇతర పక్షాలైన ఎల్‌జేపీ (ఆర్‌వీ) 19, హెచ్‌ఏఎం 5, ఆర్‌ఎల్‌ఎం 4 స్థానాల్లో విజయం సాధించాయి. ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధరీ, విజయ్ కుమార్ సిన్హా సహా గాయని మైథిలీ ఠాకూర్, శ్రేయసి సింగ్ వంటి ప్రముఖులు గెలుపొందారు. మరోవైపు, ప్రతిపక్ష మహాగఠబంధన్ ఈ ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసింది. 2020లో 110 సీట్లు గెలుచుకున్న ఈ కూటమి, ఈసారి కేవలం 34 స్థానాలకే పరిమితమైంది. తేజస్వి యాదవ్ నేతృత్వంలోని ఆర్‌జేడీ 75 సీట్ల నుంచి 25 స్థానాలకు పడిపోగా, కాంగ్రెస్ పార్టీ 19 నుంచి 6 సీట్లకు దిగజారింది. ఇది కాంగ్రెస్ చరిత్రలోనే రెండో అత్యంత పేలవమైన ప్రదర్శన. వామపక్షాలు 3 సీట్లకే సరిపెట్టుకున్నాయి. ఈ ఫలితాలతో బీహార్ రాజకీయాల్లో ఎన్డీఏ తన పట్టును మరింత బిగించినట్లయింది. ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్, ఎన్డీఏ కూటమి పాలన కొనసాగడం ఖాయమైంది.

### ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారు: మోదీ

బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తదితరులు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి గెలిపించాయని అన్నారు. బీహార్ అభివృద్ధికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ చారిత్రక విజయం మరింత శక్తినిస్తుందని అన్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. "సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి విజయం సాధించింది. ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం సాధించింది. సామాజిక న్యాయం విజయం సాధించింది" అని ఆయన పేర్కొన్నారు. "రాబోయే కాలంలో బీహార్ అభివృద్ధి కోసం మరింత చురుకుగా పనిచేస్తాం. రాష్ట్ర మౌలిక సదుపాయాలకు, సంస్కృతికి కొత్త గుర్తింపును అందిస్తాం. ఇక్కడి యువ శక్తి, మహిళా శక్తికి ఉజ్వల భవిష్యత్తు కోసం తగిన అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నాను" అని మోదీ తెలిపారు. ఎన్డీయేకు ఈ చారిత్రక విజయాన్ని అందించిన బీహార్ ప్రజలకు ప్రధాని మోదీ ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రజా తీర్పు, ప్రజలకు సేవ చేయడానికి, బీహార్ కోసం కొత్త సంకల్పంతో పనిచేయడానికి తమకు మరింత శక్తినిస్తుందని అన్నారు. ఈ విజయం వెనుక ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కృషి ఎంతో ఉందని ప్రశంసించారు. "ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ జీకి, ఎన్డీయే కుటుంబ సహచరులైన చిరాగ్ పాశ్వాన్ జీ, జితన్ రామ్ మాంఝీ జీ, ఉపేంద్ర కుష్వాహా జీలకు ఈ అద్భుత విజయానికి నా హృదయపూర్వక అభినందనలు" అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, ప్రతిపక్షాలు ప్రచారం చేసిన ప్రతీ అబద్ధాన్ని గట్టిగా తిప్పికొడుతూ, తమ అభివృద్ధి అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లిన ఎన్డీయే కార్యకర్తల అవిశ్రాంత శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని మోదీ అన్నారు. ప్రతి కార్యకర్తను హృదయపూర్వకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఇక, వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్న ప్రతి ఒక్కరి విజయమిదని అమిత్ షా పేర్కొన్నారు. జంగల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలు చేసేవారు ఏ వేషంలో వచ్చినా వారికి దోచుకునే అవకాశం లభించదని పేర్కొన్నారు. బీహార్ ఎన్నికల్లో ప్రజలు ఎన్డీయే కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. అపూర్వ విజయం సాధించిన నేపథ్యంలో ఆయన మోదీ, నితీశ్ తదితరులకు అభినందనలు తెలియజేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ సారథ్యంలోనే బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. మోదీ, నితీశ్ ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ విధానాలపై ప్రజల నమ్మకానికి ఈ విజయం నిదర్శనమని జేపీ నడ్డా పేర్కొన్నారు. జంగల్ రాజ్, అవినీతిని రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని అన్నారు. సుపరిపాలన, సుస్థిరత, అభివృద్ధికి ఓటు వేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు అఖండ మెజారిటీతో గెలిపించారని బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్ కుమార్ పేర్కొన్నారు. తమకు అపూర్వ విజయాన్ని అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచిన ప్రధానమంత్రి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరి మద్దతుతో బీహార్ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.



### ఫలితాలు ఆశ్చర్యపరిచాయి: రాహుల్ గాంధీ

బీహార్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. బీహార్‌లో ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. బీహార్ ఎన్నికలు మొదటి నుంచి న్యాయంగా జరగలేదని ఆయన ఆరోపించారు. ఈ కారణంగానే తమ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణకు తాము పోరాడుతున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఫలితాలను సమీక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి జరుగుతున్న పోరాటమని ఆయన వ్యాఖ్యానించారు. మహాఘట్‌బంధన్‌పై విశ్వాసం ఉంచి ఓటు వేసిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీయూ కూటమి 200కు పైగా స్థానాలు గెలుచుకోగా, ఆర్జేడీ-కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ 34 సీట్లకు పరిమితమైంది. కాంగ్రెస్ పార్టీ 61 స్థానాల్లో పోటీ చేసి 6 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. బీహార్‌లో కాంగ్రెస్ పార్టీకి ఇది రెండో అత్యంత దారుణ ఓటమి. 2010లో కాంగ్రెస్ పార్టీ 4 స్థానాలు మాత్రమే గెలుచుకుంది.

# బీఆర్‌ఎస్ కనుమరుగే

మొదటి పేజీ తరువాయి

ప్రజలు ఓడించారు. అయినా బుద్ధి రాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. అప్పటికీ వ్యవహార శైలిలో మార్పు రాలేదు. ఇప్పుడు జూబ్లీహిల్స్‌లో మళ్లీ బుద్ధి చెప్పారు' అంటూ కేటీఆర్ , హరీష్ రావుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ వరుస ఓటముల తర్వాత కూడా వారి వైఖరి మారకపోతే.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ కనిపించకుండా పోవడం ఖాయం అని రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని.. ప్రభుత్వానికి సహకరించాలని ఆయన ప్రతిపక్ష నేతలకు సూచించారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ.. నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని ఆయన అభిప్రాయపడ్డారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదని గుర్తుచేస్తూ.. ఆ ఫలితాల తర్వాత హైదరాబాద్ ప్రజలకు కాంగ్రెస్‌పై క్రమంగా నమ్మకం పెరుగుతోందని అన్నారు. 'గెలుపోటములకు కాంగ్రెస్ ఎప్పుడూ కుంగిపోదు, పొంగిపోదు. ప్రజల తరపున నిలబడటం, పోరాడటమే కాంగ్రెస్ కర్తవ్యం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో తమ రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి, జూబ్లీహిల్స్‌లో ఈ తీర్పు ఇచ్చారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ అభివృద్ధి విషయంలో బీఆర్‌ఎస్ వైఖరిని తప్పుబట్టారు. రాష్ట్ర ఆదాయంలో 65 శాతం వరకు హైదరాబాద్ నుంచే వస్తోందని, హైదరాబాద్ అభివృద్ధి కోసం ఎవరి పాత్ర వాళ్లం పోషిద్దామని పిలుపునిచ్చారు. హైడ్రా, ఈగల్ వంటి సంస్థలను హైదరాబాద్ అభివృద్ధి కోసమే ప్రభుత్వం తీసుకొచ్చిందని.. కానీ వాటిపైనే బీఆర్‌ఎస్ దృష్టి పెట్టి తప్పుడు ప్రచారం చేసిందని ఆరోపించారు. ప్రజలు వాస్తవాన్ని గుర్తించి ఓటు వేశారని అన్నారు. సోషల్ మీడియాలో విష ప్రచారం చేయడం ఇకనైనా బీఆర్‌ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కూడా సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. 'కిషన్ రెడ్డి ఇప్పుడైనా మేల్కొని సచివాలయానికి రావాలి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై చర్చించి.. కలిసి సాధించుకొద్దాం' అని ఆయన ఆహ్వానించారు. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో కిషన్ రెడ్డి సహాయ నిరాకరణ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కిషన్ రెడ్డి ఈ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా మారి ప్రచారం చేశారని సీఎం ఎద్దేవా చేశారు. 'పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క జూబ్లీహిల్స్‌లోనే కిషన్ రెడ్డికి 60 వేల ఓట్లు వచ్చాయి. ఆయన అభ్యర్థిగా మారి ఇన్ని రోజులు ప్రచారం చేస్తే 17 వేల ఓట్లే వచ్చాయి. ఇప్పటికైనా కిషన్ రెడ్డి తన వ్యవహార శైలి మార్చుకోవాలి' అని సీఎం హితవు పలికారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేస్తామని, మిగతా సమయంలో రాష్ట్ర అభివృద్ధే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## బీజేపీ డిపాజిట్ గల్లంతు

మొదటి పేజీ తరువాయి

కాస్త దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. జూబ్లీహిల్స్ లో తాము ఎప్పుడూ ఒక కార్పొరేటర్ కూడా గెలవలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నుంచి ఎప్పుడు గెలవలేదని గుర్తుచేశారు. తాము ఉన్నంతలో ప్రయత్నం చేశామని చెప్పుకొచ్చారు. ఎంఐఎం మద్దతు, డబ్బుతోనే జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందని ఆరోపించారు. కాగా తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకీ ప్రత్యామ్నయం అని చెప్పుకుంటున్న బీజేపీ ఈ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కూడా దక్కించుకోకపోవడం సంచలనంగా మారింది. కాగా ఉప ఎన్నిక నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచే బీజేపీ ఈ స్థానంపై అంతగా ఆసక్తి చూపలేదు. అభ్యర్థిని ప్రకటించడంలోనూ ఆలస్యం చేసింది. రాష్ట్ర నాయకత్వం ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసి కేంద్ర నాయకత్వానికి పంపినప్పటికీ వారిలో అభ్యర్థిని ఎంపిక చేయడంలోనూ అధిష్టానం ఆసక్తి చూపలేదు. బీహార్ ఎన్నికల షెడ్యూల్‌కు ఇచ్చిన ప్రాధాన్యత జూబ్లీహిల్స్‌కు ఇవ్వలేదని తెలుస్తోంది. మరోవైపు ఎన్నికల ప్రచారంలోనూ ఆ పార్టీ నేతలు పెద్దగా పాల్గొనలేదన్న ప్రచారం ఉంది. కేవలం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మినహా మిగిలిన వారు ఎన్నికల ప్రచారంలో పాల్గన్న దాఖలాలు లేవు. రాష్ట్రంలో బీజేపీకి 8మంది ఎంపీలు, 8 ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ వారు ఎవరూ ఎన్నికల ప్రచారంలో అంతగా కనిపించలేదు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాత్రమే తరుచుగా కనిపించగా, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి అక్కడక్కడ ప్రచారం చేశారు. కాగా తెలంగాణకు చెందిన పలువురు బీజేపీ నేతలు బీహార్ కు వెళ్లి ప్రచారం చేసినప్పటికీ జూబ్లీహిల్స్‌లో మాత్రం ప్రచారం చేయలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల్లో ప్రచారం చేసిన కిషన్ రెడ్డి కేంద్రం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించడంలో ఫెయిల్ అయ్యారనే టాక్ వినపడుతోంది. కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎంలను టార్గెట్ చేస్తూ ప్రచారం చేస్తే. బండి సంజయ్ కేవలం హిందూ, ముస్లిం సామాజిక వర్గాల్లో తేడాను ప్రచారం చేయడంతో పాటు తమకు వ్యతిరేక వర్గం ఓట్లు వద్దు అంటూ ఖరాఖండీగా చెప్పడం గమనార్హం. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు కూడా ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమయ్యారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం మీద కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఉప ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోవడం పార్టీ ప్రతిష్టకు చెరగని మచ్చే అనడంలో సందేహం లేదు.

## ప్రత్యామ్నాయం బీఆర్‌ఎస్సే

మొదటి పేజీ తరువాయి

జూబ్లీహిల్స్ ఎన్నికలు పారదర్శకంగా జరగలేదు. ఈ ఎన్నికలు ఎలా జరిగాయో ప్రజలకు తెలుసు. మాగంటి సునీత చివరి దాకా పోరాటం చేశారు. ఈ ఎన్నిక కోసం మేం కుల, మత రాజకీయాలు చేయలేదు. బీఆర్‌ఎస్ ఒత్తిడి వల్లే అజారుద్దీన్‌కు మంత్రి పదవి వచ్చింది. బీఆర్‌ఎస్ హయాంలో జూబ్లీహిల్స్ అన్నివిధాలా అభివృద్ధి చెందింది. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం. జూబ్లీహిల్స్ ఫలితాలపై మాకు నిరాశ లేదు. బీఆర్‌ఎస్‌కు పోరాటాలు కొత్త కాదు. రాబోయే రోజుల్లో ప్రతిపక్షంగా మా పని మేం చేసుకుంటూపోతాం. మళ్లీ కేసీఆర్ సీఎం అయ్యేదాకా పోరాటం చేస్తాం' అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఒక్క ఉపఎన్నికలోనే వారు తడబడుతున్నారని, మరో 10 ఉపఎన్నికలు వస్తే వారి పరిస్థితి ఏమవుతుందో చూడాలని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలను గట్టిగా లేవనెత్తేందుకు బీఆర్‌ఎస్ ఎప్పటికీ వెనక్కి తగ్గదని ఆయన నొక్కి చెప్పారు. రాజకీయంగా కాంగ్రెస్ నేతల ఆటలను ఎండగడతామని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ నుంచి టీఎంసీలోకి చేరిన ఓ ఎమ్మెల్యేపై హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. ఇదే తరహా న్యాయం తెలంగాణలోనూ జరుగుతుందని తాము ఆశిస్తున్నామని అన్నారు. దేశవ్యాప్తంగా ఒకే రూల్ అమలు కావాలని, రాజకీయ దళారీలకు చెక్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో న్యాయస్థానాలు నీతిని నిలబెడతాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం ఆపసోపాలు పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒక్క ఉపఎన్నికలోనే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మరిన్ని ఎన్నికలు వస్తే వారి స్థితి దయనీయంగా మారుతుందని హెచ్చరించారు. ప్రజల మనసు గెలుచుకోవడంలో కాంగ్రెస్ విఫలమవుతోందని, బీఆర్‌ఎస్ మాత్రం ప్రజలతోనే ఉంటుందని అన్నారు. రాజకీయ చాణక్యంతో కాంగ్రెస్‌ను ఎదుర్కొంటామని సవాల్ విసిరారు. రాజకీయ పరిణామాలపై బీఆర్‌ఎస్ ఎప్పటికీ అప్రమత్తంగా ఉంటుందని కేటీఆర్ తేల్చిచెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఈ బాధ్యత నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు గట్టి పోటీ ఇవ్వడానికి బీఆర్‌ఎస్ సిద్ధంగా ఉందని, రాబోయే రోజుల్లో ప్రజలే తమకు బలమని అన్నారు. రాజకీయంగా, న్యాయపరంగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## జూబ్లీహిల్స్‌లో న'విన్'

మొదటి పేజీ తరువాయి

అన్నారు. 'జూబ్లీహిల్స్ ప్రజలకు కృతజ్ఞతలు. నేను కక్షపూరిత రాజకీయాలు చేయను. అంతా కలిసి పనిచేద్దాం. అధిక నిధులు తీసుకొచ్చి జూబ్లీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేస్తా. అభివృద్ధే ఎజెండాగా పనిచేస్తాం. జూబ్లీహిల్స్‌ను రోల్ మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా' అని గెలిచిన అనంతరం నవీన్ యాదవ్ పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధి చేయలేదని, ప్రజలకు ఆ విషయం చెప్పుకోలేక తమపై దుష్ప్రచారం చేసి ఎన్నికల్లో గెలవాలని చూసిందని ఆరోపించారు. ప్రజలందరూ తమ ఓటుతో బీఆర్‌ఎస్ పార్టీ దుష్ప్రచారాలను తిప్పికొట్టారని అన్నారు. తన విజయం కోసం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై నమ్మకంతో ఓట్లు వేశారని ఆయన అన్నారు. ఈరోజుతో ఎన్నికలు ముగిశాయని, మనమందరం కలిసి మన ప్రాంత అభివృద్ధి కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. బెదిరిస్తే ప్రజలు ఓటు వేసే రోజులు ఎప్పుడో పోయాయని అన్నారు. తనను నమ్మి ఓట్లు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపిన నవీన్ యాదవ్, నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## రాహుల్, కేటీఆర్ ఐరన్ లెగ్స్

మొదటి పేజీ తరువాయి

ఓట్ చోరీ అంటున్న రాహుల్ గాంధీ..జూబ్లిహిల్స్ లో ఏంచేసి గెలిచారో చెప్పాలని ఆరోపణలు గుప్పించారు. ఇక కాంగ్రెస్ గెల్చినందుకు ఆరు గ్యారంటీలురావని, డీఏ ఇవ్వరని, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ లు రావని కూడా బండి సంజయ్ అన్నారు.

## కర్మ హిట్స్ బ్యాక్

మొదటి పేజీ తరువాయి



అని ఆమె భావించి ఉండవచ్చు. కాంగ్రెస్ గెలుపు అధికార పార్టీకి బలాన్ని ఇవ్వగా, బీఆర్‌ఎస్‌లో మాత్రం ఓటమికి బాధ్యులు ఎవరు అనే చర్చను.. అంతర్గత కలహాలను ఈ 'కర్మ హిట్స్ బ్యాక్' ట్వీట్ మరింత పెంచింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో తన అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేస్తూ.. కేసీఆర్‌ను మినహాయించి ఇతర నాయకుల వైఫల్యాలను నిలదీస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ ఓటమి తర్వాత ఆమె చేసిన " కర్మ హిట్స్ బ్యాక్ " ట్వీట్ ఈ అంతర్గత రాజకీయ విభేదాలకు నిదర్శనం. ఈ ట్వీట్ ద్వారా.. పార్టీలో తన పట్టును తక్కువ చేసి చూసినవారిని, తన రాజకీయ భవిష్యత్తుపై అనుమానం వ్యక్తం చేసిన నాయకులను కవిత పరోక్షంగా విమర్శించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమె వైఖరిని హేళన చేసినవారికి, జూబ్లీహిల్స్ ఫలితం "చెంప పెట్టు లాంటిది" అని కవిత అభిమానులు సోషల్ మీడియాలో ఘాటుగా వ్యాఖ్యానిస్తున్నారు. కవిత ట్వీట్ బీఆర్‌ఎస్‌లో త్వరలో జరగబోయే నాయకత్వ మార్పు లేదా అంతర్గత ప్రక్షాళనకు సంకేతం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# బీజేపీ అభ్యర్థి ఓటమి బీజేపీ వల్లే

**కిషన్ రెడ్డి, సంజయ్, లక్ష్మణ్ పార్టీ భ్రష్టుపట్టిస్తున్నారు**

**గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ఫలితాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ నాయకులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కృషి చేస్తే, బీజేపీ నేతలు మాత్రం తమ అభ్యర్థిని ఓడించేందుకు పనిచేశారని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ నాయకులంతా ఏకతాటిపైకి వచ్చి నవీన్ యాదవ్ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారని ఆయన అన్నారు. కానీ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని ఓడించేందుకే కొందరు బీజేపీ నాయకులు పనిచేశారని ఆరోపించారు. అందుకే కనీసం డిపాజిట్ కూడా దక్కలేదని అన్నారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకులు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులను చూసి బీజేపీ నాయకులు చాలా నేర్చుకోవాలని సూచించారు. రాష్ట్ర బీజేపీ నేతలు ఇలాగే వ్యవహరిస్తే రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో భంగపాటు తప్పదని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ ఓటమికి బాధ్యులెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీని కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. వీరి కారణంగా పార్టీ అధికారంలోకి రావడం లేదని, పైగా పార్టీ కోసం పనిచేసిన వారిని ఎదగనీయడం లేదని ఆరోపించారు. తాను ప్రత్యేకంగా ఎవరినీ లక్ష్యంగా చేసుకోవడం లేదని, కానీ పార్టీ పరిస్థితి చూసి బాధతో ఈ మాటలు మాట్లాడుతున్నానని అన్నారు.



## అన్నగా అండగా ఉంటా

**మాగంటి సునీత కొడుకుతో హిమాన్షు**



హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్షు రావు ఫేస్‌బుక్ వేదికగా ఒక ఆసక్తికరమైన పోస్ట్ చేశాడు. మాగంటి గోపీనాథ్ కుమారుడు వాత్సల్యనాథ్‌తో ఇదివరకు దిగిన ఫొటోలను పంచుకుంటూ, ఒక అన్నగా ఎల్లప్పుడూ నీకు తోడుగా ఉంటానని పేర్కొన్నాడు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీత పరాజయం పాలైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వాత్సల్యనాథ్‌తో దిగిన ఫొటోలను హిమాన్షు పంచుకున్నాడు. వాత్సల్యతో తనకు 13 ఏళ్ల స్నేహబంధం ఉందని తెలిపాడు. మాగంటి గోపీనాథ్ మృతి తర్వాత తల్లి సునీత ఎన్నికల ప్రచారంలో వాత్సల్య కీలక పాత్ర పోషించడం గర్వంగా ఉందని హిమాన్షు అన్నారు.

## ప్రజలు బీఆర్ఎస్‌కు సెలవు ప్రకటించారు: మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ తీర్పుతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి సెలవు ప్రకటించారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి చోటులేదని మరోసారి రుజువైందని అన్నారు. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు. నవీన్ యాదవ్‌ను గెలిపించిన ఘనత ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తది అని అన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని గౌరవించాల్సిందే: ఆర్ఎస్పీ

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలందరికీ, ప్రజలందరికీ బీఆర్ఎస్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అభినందనలు తెలిపారు. అధికార కాంగ్రెస్ పార్టీ అఘాయిత్యాలు చేసినా, ఎన్ని అవకతవకలకు పాల్పడినా, ఎన్ని ఘోరాలకు తెగించినా, తప్పుడు కేసులు బనాయించి, రౌడీలతో బెదిరించినా.. భయపడకుండా నిలబడిన ప్రతి కార్యకర్త ఈ ఎన్నికల్లో నైతికంగా విజేతే అని ఆయన పేర్కొన్నారు. 20 వేల దొంగ ఓట్లు ఉన్నాయని, కాంగ్రెస్ నాయకుల ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేసినా, దొంగ ఓటర్లను దొరకపట్టి అప్పజెప్పినా.. ఎన్నికల కమీషన్, పోలీసు యంత్రాంగం ఎలా పనిచేసిందో కళ్లారా చూశాం అని తెలిపారు. ఏదేమైనా ప్రజాస్వామ్యాన్ని గౌరవిద్దాం అని ఆయన పేర్కొన్నారు. నవీన్ యాదవ్‌కు అభినందనలు. జై తెలంగాణ అని ఆర్ఎస్పీ నినదించారు.

## 17న కేబినెట్ భేటీ

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): ఈ నెల 15వ తేదీ జరగాల్సిన కేబినెట్ సమావేశం 17వ తేదీకి వాయిదా పడింది. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే కేబినెట్ సమావేశం మూడుసార్లు వాయిదా పడింది. ఈ నెల 7వ తేదీన కేబినెట్ సమావేశం ఉంటుందని ప్రకటించారు. కానీ కేబినెట్ మీటింగ్‌ను 12వ తేదీకి, మళ్లీ 15వ తేదీకి వాయిదా వేస్తూ వచ్చారు. శుక్రవారం సీఎం మాట్లాడుతూ.. 17వ తేదీన కేబినెట్ సమావేశం ఉంటుందని చెప్పారు. కేబినెట్‌లో స్థానిక సంస్థల ఎన్నికపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మంత్రులందరితో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## భారత్‌కు పెట్టుబడుల గేట్‌వే ఏపీ

**త్వరలో డ్రోన్ ట్యాక్సీలు: చంద్రబాబు**

వైజాగ్, నవంబర్ 14 (ఈవార్తలు):ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని భారతదేశానికి పెట్టుబడుల ముఖద్వారంగా (గేట్‌వే) తీర్చిదిద్దుతున్నామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను, ప్రభుత్వ దార్శనికతను ప్రపంచ పారిశ్రామికవేత్తల ముందు ఆవిష్కరించారు. త్వరలోనే ఏపీ నుంచి డ్రోన్ ట్యాక్సీలను ప్రారంభిస్తామని, విశాఖలో 'ఆంధ్రా మండపం' నిర్మిస్తామని కీలక ప్రకటనలు చేశారు. ఈ సదస్సుకు 72 దేశాల నుంచి 522 మంది విదేశీ ప్రతినిధులతో పాటు మొత్తం 2,500 మంది పారిశ్రామికవేత్తలు హాజరయ్యారని చంద్రబాబు తెలిపారు. విశాఖపట్నం అత్యంత సుందరమైన, సురక్షితమైన నగరమని, ఇక్కడి ప్రకృతి వనరులు, బీచ్‌లు, కొండలు ఎంతో ప్రత్యేకమైనవని కొనియాడారు. బీహార్ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు పట్టం కడుతున్నారని, ఇది ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు. గతంలో ఉన్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అధిగమించి, ప్రస్తుతం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ముందుకెళ్తున్నామని చంద్రబాబు వివరించారు.

## రిగ్గింగ్‌తోనే కాంగ్రెస్ గెలుపు

**నైతిక గెలుపు నాదే: మాగంటి సునీత**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో రిగ్గింగ్, రౌడీయిజం గెలిచాయని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ అన్నారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. కాంగ్రెస్‌ది గెలుపే కాదని.. నైతిక విజయం తనది, బీఆర్ఎస్‌దే అని ఆమె స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కౌంటింగ్ అనంతరం మాగంటి సునీత మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అప్రజాస్వామికంగా ఎన్నికలు జరిగాయని అన్నారు. పోలింగ్ రోజున ఎంతో అరాచకం సృష్టించారని తెలిపారు. ఒక మహిళపై అంతమంది రౌడీయిజం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని అన్నారు. నేను ఏం మాట్లాడినా.. కార్యకర్తలను పరామర్శించినా తప్పుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇవాళ ఉదయం నుంచే కౌంటింగ్ హాలులో ఆడవాళ్లపై కాంగ్రెస్ ర్యాగింగ్ మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిచోట రిగ్గింగ్ చేయడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని అన్నారు. ఒక మహిళపై కాంగ్రెస్ నేతలు రౌడీ రాజకీయం చేశారని అన్నారు. ప్రజలను కాంగ్రెస్ భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. గత ఎన్నికలు, ప్రస్తుత ఎన్నికలకు మధ్య తేడా ఏంటో ప్రజలు గమనించారని అన్నారు. తనకు మద్దతుగా నిలిచిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## గుండెపోటుతో ఇండిపెండెంట్ అభ్యర్థి మృతి

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠ నడుమ తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఒకరైన మహమ్మద్ అన్వర్ (40) గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు. వివరాల్లోకి వెళితే, ఎర్రగడ్డలో నివాసముంటున్న అన్వర్ ఉదయం నుంచి జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియను ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తీవ్రమైన ఛాతీ నొప్పితో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఒత్తిడి, ఆందోళనే ఆయన మరణానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. అన్వర్ ఆకస్మిక మరణంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాజకీయ వర్గాలు సైతం సంతాపం వ్యక్తం చేస్తున్నాయి. ఈ విషాద ఘటన ఓ వైపు ఆవేదన కలిగిస్తుండగా, మరోవైపు యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ జరుగుతోంది. మొత్తం 10 రౌండ్లలో, 42 టేబుళ్లపై ఓట్లను లెక్కిస్తున్నారు. పారదర్శకత కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో 186 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

## జూబ్లీహిల్స్ చరిత్రలోనే అత్యధిక మెజార్టీ

జూబ్లీహిల్స్/హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గ్రాండ్ విక్టరీ సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపినాథ్‌పై 24,658 వేల ఓట్ల మెజార్టీతో గెలుపు కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో నవీన్ యాదవ్ నయా రికార్డ్ సృష్టించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందిన వ్యక్తిగా ఘనత సాధించారు. జూబ్లీహిల్స్ నియోజవర్గంలో ఇప్పటివరకు అత్యధిక మెజార్టీ పీజేఆర్ కుమారుడు విష్ణు పేరిట(2009లో 21,741) ఉండేది. ఇక, దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 2014లో 9,242, 2018లో 16,004, 2023లో 16,337 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ 24,658 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించి నియోజకవర్గ చరిత్రలో అత్యధిక మెజార్టీ సాధించిన వ్యక్తిగా రికార్డ్ క్రియేట్ చేశాడు.



## డ్యాన్స్ చేసిన వీహెచ్

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యంతో విజయం దిశగా దూసుకెళ్తోంది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ప్రతి రౌండ్‌లోనూ తన సమీప ప్రత్యర్థిపై ఆధిక్యాన్ని పెంచుకుంటూ గెలుపును ఖాయం చేసుకుంటున్నారు. లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క రౌండ్‌లో కూడా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థి మాగంటి సునీత ముందంజ వేయలేకపోయారు. ఓట్ల లెక్కింపు సరళిని బట్టి కాంగ్రెస్ విజయం తథ్యమని తేలిపోవడంతో, పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో అప్పుడే సంబరాలు మొదలయ్యాయి. పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని సందడి చేస్తున్నారు. బాణసంచా కాలుస్తూ, ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నేత వి.హనుమంతరావు డ్యాన్స్ చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ గెలుపు ఖాయమనే ధీమా వారిలో కనిపిస్తోంది. రౌండ్ రౌండ్‌కూ నవీన్ యాదవ్ ఆధిక్యం అంతకంతకూ పెరుగుతుండటంతో, తుది ఫలితం వెలువడకముందే గాంధీభవన్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది.





## కేసీఆర్ గురించి అందుకే మాట్లాడను: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తమ బాధ్యతను మరింతగా పెంచిందని అన్నారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న తమ పాలనకు ప్రజలు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. రాజకీయాల్లో కేసీఆర్ క్రియాశీలకంగా లేనందున తాను ఆయన గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న నాయకుడిని విమర్శించడం భావ్యం కాదని అన్నారు. అయితే కేటీఆర్‌కు అహంకారం పోలేదని, హరీశ్ రావు అసహనం తగ్గించుకోవాలని హితవు పలికారు. వారి తీరు మారకుంటే ప్రజలు ఎలా అంగీకరిస్తారన్న విషయం అర్థం చేసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. మంత్రుల అభిప్రాయాలను తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## నైతికంగా గెలిచింది బీఆర్ఎస్సే : రాకేశ్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఫలితంతో ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు. సాంకేతికంగా కాంగ్రెస్ గెలిచినా.. నైతికంగా బీఆర్ఎస్సే గెలిచిందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ గెలవాలని తెలంగాణ ప్రజలు కోరుకున్నప్పటికీ.. వేల కొద్దీ దొంగ ఓట్లు, బెదిరింపులు, దాడులు, చీరలు, మిక్సీలు, కుక్కర్‌లు, గ్రైండర్‌ల పంపిణి వల్లే కాంగ్రెస్ గెలిచిందన్నారు. ఓటుకు ఐదు వేలు.. వీధికో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రచారం చేశారు. వారం రోజుల పాటు సీఎం వీధులు పట్టుకొని ప్రచారం నిర్వహించారు. ఎన్నికల రోజు బూతులు పట్టుకొని డిప్యూటీ సీఎం తిరుగుడు. పోలింగ్ రోజు బూతుల దగ్గర ఎమ్మెల్యేలు పోల్ స్లిప్పులు పట్టుకొని డబ్బులు పంచడం జరిగింది. సుమారుగా 55 బూతుల్లో రిగ్గింగ్ జరిగిందని రాకేశ్ రెడ్డి తెలిపారు. 'మన బస్తీ పిలగాడు.. పాపం ఇప్పటికే రెండు సార్లు ఓడిపోయిండు అనే సానుభూతి. ఇవన్నీ కలిసి ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేసినాయి. కాంగ్రెస్ పార్టీని గెలిపించాయి. వాస్తవానికి ఇది కాంగ్రెస్ లేదా రేవంత్ రెడ్డి గెలుపు అనడం కంటే నవీన్ యాదవ్ గెలుపు అనడం సముచితంగా ఉంటది. ఎందుకంటే కాంగ్రెస్ %-% నవీన్ యాదవ్ = ఏమి లేదు అక్కడ' అని ఏనుగుల రాకేశ్ రెడ్డి పేర్కొన్నారు.







## 10 జిల్లాలలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): తెలంగాణను చలి వణికిస్తోంది. ఎముకలు కొరికేలా చలి తీవ్రత మారింది. రాష్ట్రమంతటా సాధారణ ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. 10 జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు చలి గాలులు, పొగమంచుతో రహదారులు కమ్ముకుంటున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రతలు 7.8 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణశాఖ వెల్లడించింది. అదే విధంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌లో 8.3, వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 8.7, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 8.8 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 7.8 నుంచి 13.9 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నవంబర్ నెలలో 2016లో మోమిన్‌పేటలో అత్యల్పంగా 7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. శుక్రవారం కోహిర్‌లో నమోదయ్యాయి. రాబోయే రోజుల్లో తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 %-% 4 డిగ్రీలు తక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల వరకు ఉండే అవకాశం ఉందన్నారు. ఉపరితల గాలులు ఈశాన్య దిశ నుంచి గంటకు 4-6 కి.మీ వేగంతో వీచే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.



# గాయత్రి బ్యాంకు 3647.67 కోట్ల వ్యాపారం

జగిత్యాల టౌన్, నవంబర్ 14 (ఈవార్తలు): రూ.3647.67 కోట్ల వ్యాపారాన్ని అధిగమించామని గాయత్రి బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి వనమాల శ్రీనివాస్ తెలిపారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకొని సహకార పతాకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో డిజిటలైజేషన్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని, వినియోగదారులకు డిజిటల్ విధానం ద్వారా పేమెంట్స్‌ను సులభతరం చేయడం వల్ల మాత్రమే నిజమైన ఫైనాన్సియల్ ఇంక్లూషన్ ను సాధించగలుగుతామని అన్నారు. గాయత్రి బ్యాంకు ద్వారా అన్ని రకాల పేమెంట్ చానళ్లను విస్తృతంగా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా డిజిటల్ సేవలను ప్రమోట్ చేస్తూ సహకార రంగంలో అభివృద్ధిని సాధిస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్, జనరల్ మేనేజర్లు శ్రీలత, బోగ రవీంధర్, పీటీఎస్ శ్రీనివాస్, సీహెచ్ కృష్ణా రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



# బీహార్‌లో బీజేపీ గెలుపు.. మల్యాలలో సంబురాలు

మల్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): బీహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం ఘనవిజయం సాధించినందుకు బీజేపీ మల్యాల మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో స్థానిక అంగడి బజార్‌లో పటాకులు కాల్చి స్వీట్ పంపిణీ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీహార్‌లో పట్టు తప్పితే, ఢిల్లీ పీఠం కూలిపోతుందన్న కాంగ్రెస్ లెక్కలు, కలలు పటాపంచలయ్యాయని ఎద్దేవా చేశారు. ప్రజలు బీజేపీ వైపు, ప్రధాని మోదీ అభివృద్ధి, సుపరిపాలన వైపు బలంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బొట్ల ప్రసాద్, కొక్కెర మల్లేశం యాదవ్, కటకం లత, అవుదుర్తి రమ, కొణిదెల రాజన్న, పొన్నం సాయికుమార్, సామ మైపాల్ రెడ్డి, దిండిగాల దేవయ్య, పొన్నగంటి గౌతమ్, గుండేటి గంగారాం, హరీష్, నాగరాజ్, హర్షవర్ధన్, రుత్తకిషన్, తడిగొండ రాజు, సాగర్, రాజ్ కుమార్, పరమేష్, జిల్లాల రమేష్, సంత శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏపీలో రిలయన్స్ భారీ పెట్టుబడులు

**1 గిగావాట్ సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ నిర్మాణం**

వైజాగ్, నవంబర్ 14 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయెన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది. విశాఖ నగరంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో రిలయెన్స్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్, సోలార్ పవర్ ప్లాంట్, గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. రిలయెన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎంఎస్ ప్రసాద్, ఆర్ఐఎల్ సౌతిండియా మెంటార్ మాధవరావు ముఖ్యమంత్రితో భేటీ అయి రాష్ట్రంలో పెట్టుబడులపై కీలక అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా 1 గిగావాట్ సామర్థ్యంతో ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన %ూఖ%లు, %ూఖ%లు, %ూ×% ప్రాసెసర్‌లతో కూడిన ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న రిలయెన్స్ ఏఐ డేటా సెంటర్‌కు అనుబంధంగా ఏపీలో ఈ సెంటర్ పనిచేస్తుంది. ఈ రెండు కేంద్రాలతో ఆసియాలోనే అత్యంత బలమైన ఏఐ నెట్‌వర్క్‌లలో ఒకటిగా రిలయెన్స్ అవతరించనుంది. ఈ ఏఐ డేటా సెంటర్ విద్యుత్ అవసరాల కోసం ప్రత్యేకంగా 6 గిగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టును కూడా రిలయెన్స్ నిర్మించనుంది. దీంతో పాటు కర్నూలులో 170 ఎకరాల్లో ప్రపంచ స్థాయి ఆటోమేటెడ్ సౌకర్యాలతో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్రంపై నమ్మకంతో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చిన రిలయెన్స్ అధినేత ముఖేశ్ అంబానీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.

# వేములవాడలో కాంగ్రెస్ విజయోత్సవాలు

వేములవాడ, నవంబర్ 14(ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించారని, ప్రజా పాలనకే ప్రజలు మొగ్గు చూపారని వేములవాడ పట్టణ కాంగ్రెస్ నాయకులు అన్నారు. తిప్పాపూర్ బస్టాండ్‌లో బాణాసంచా కాల్చి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందడంతో ప్రజల సుఖసంతోషాలతో ఉన్నారని, ఎన్నికల సమయంలో కేటీఆర్ హైడ్రా పేరుతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారని, అయినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని, బీజేపీ, బీఆర్ఎస్ మాటలను ప్రజలు పట్టించుకోలేదని, జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు నిరూపించారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడానికి జూబ్లీహిల్స్ ఎన్నిక శుభసూచకమఅని అన్నారు. కార్యక్రమంలో



మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి నాయకులు కూరగాయల కొమరయ్య, వస్తాది కృష్ణ, అన్నారం శ్రీనివాస్, ఇప్పపుల అజయ్, పుల్కం రాజు, పులి రాంబాబు, నాగుల రాము, ముంజ ఉపేందర్, కోయల్ కార్ మస్తాన్, కోలాకాని రాజు, అబ్దుల్ రజాక్, కట్కూరు శ్రీనివాస్, నాగుల విష్ణు, నాగుల రవీందర్, కొక్కుల బాలు, అంబాటి చందు, సాబీర్, మర్రిపల్లి రాజు, జగదాంబ గణేష్, తదితరులు తదితరులున్నారు.

# నిబంధనల మేరకు ధాన్యం సేకరణ

**కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో అడ్లూరి**

బుగ్గారం, నవంబర్ 14 (ఈవార్తలు): నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని సిరికొండ గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేటప్పుడు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు మౌళిక వసతులు కల్పించాలని, హమాలీల కొరత లేకుండా ప్రతి కొనుగోలు కేంద్రంలో రోజువారిగా కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలనీ అన్నారు. 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ నగదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిర్ణిత నిబంధనల మేరకు ధాన్యాన్ని విక్రయించాలని చెప్పారు. అధికారులు ప్రతి రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సెంటర్ ఇంచార్జిలతో సమన్వయం చేసుకుంటూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.



# సంపూర్ణ పారదర్శకత దిశగా సహకార సంఘాలు

గొల్లపల్లి, నవంబర్ 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సహకార సంఘాలను సంపూర్ణ పారదర్శకత దిశగా అభివృద్ధి చేస్తున్నామని జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను ఆయన శుక్రవారం గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పాక్స్‌లను పూర్తిగా కంప్యూటరైజ్ చేసిన తొలి రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. భవిష్యత్ లో సహకార రంగాన్ని పూర్తి స్థాయి పారదర్శకత రంగం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లాలో ప్రస్తుతమున్నా 51 పీ.ఏ.సీ.ఎస్ లకు అదనంగా కొత్త సంఘాల ఏర్పాటుకు



ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. ఫుడ్ ప్రాసెసింగ్ ఆర్గనైజేషన్ ల కింద జిల్లాలో 16 సహకార సంఘాలను అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్లు నాగ సంకీర్త్, మహేష్, శ్రీనివాస్, పాక్స్ సిబ్బంది రామ్ సుధాకర్ రావు, మధుకర్, పవన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.



# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలుపు.. మల్యాలలో సంబురాలు

మల్యాల, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గారు భారీ మెజార్టీతో గెలవడంతో మల్యాలలోని అంగడి బజార్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు టపాసులు పేల్చి మిఠాయి పంపిణీ చేసి విజయత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దొంగ ఆనందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి శ్రీనివాస్ గౌడ్, వెలుమా లక్ష్మారెడ్డి, దారం ఆదిరెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శనిగారపు తిరుపతి, ముత్యాల రాంలింగారెడ్డి, మేక లక్ష్మణ్, వీరబత్తిని ప్రసాద్, కంచర్ల లక్ష్మణ చారి, నాగుల పేట సంజీవ్, చెట్టుపల్లి నరేశ్, దూడం రామాంజనేయులు, కోరే రెడ్డి, మైపాల్రావు, తాళ్ల హరినాథ్, సతీష్ రెడ్డి, బట్టు విజయ్, కనకట్ల జలంధర్, ఇంద్రసేనారెడ్డి, బండి రవి, కిషన్ రెడ్డి, ఎండీ ఇమామ్, భగత్, రామగిరి మురళి, వినయ్, బాబు, కొరేపు వెంకటేష్, రాజేశం, శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

## తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 14 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అల్మాపూర్ గ్రామంలో భారీ చోరీ తాళాలు వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలు జరిగాయి. గురువారం రాత్రి తాళం వేసి ఉన్న 5 ఇండ్లలో తాళాలు పగలగొట్టి దొంగలు చొరబడి చోరీ చేశారు. గ్రామానికి చెందిన లక్ష్మి, రాజు, దేవరాజు, మధు,రేణుక ఇండ్లలో దొంగతనం జరిగిందని పోలీసులు తెలిపారు.


## మోదీ, నితీశ్‌పై ప్రజల నమ్మకం: పవన్

అమరావతి, నవంబర్ 14 (ఈవార్తలు): దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమి విజయం దిశగా దూసుకెళుతుండటంపై ఆంధ్రప్రదేశ్ నుంచి స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎన్డీఏ కూటమికి అభినందనలు తెలుపుతూ, ఇది ప్రధాని మోదీ నాయకత్వానికి లభించిన మద్దతుగా అభివర్ణించారు. పవన్ కల్యాణ్ స్పందిస్తూ... బీహార్ ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంపై మరోసారి తమ విశ్వాసాన్ని చాటారని అన్నారు. అభివృద్ధి, పారదర్శక పాలనకే ప్రజలు పట్టం కట్టారని, ఈ అపూర్వ తీర్పు దేశం ఎలాంటి పాలన కోరుకుంటోందో స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలన్నింటికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

## పరకామణి కేసు విచారణకు వెళుతూ అధికారి మృతి

తిరుమల, నవంబర్ 14 (ఈవార్తలు): టీటీడీ మాజీ సహాయ విజిలెన్స్ అధికారి (ఏవీఎస్ఓ), ప్రస్తుతం గుంతకల్ రైల్వే ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సతీష్ కుమార్ అనుమానాస్పద మృతి తీవ్ర కలకలం రేపుతోంది. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఆయన మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. టీటీడీ పరకామణి కేసులో సీట్ విచారణకు హాజరయ్యేందుకు తిరుపతి వెళుతుండగా ఈ ఘటన జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గుంతకల్ నుంచి రైలులో బయలుదేరిన సతీష్ కుమార్, మార్గమధ్యలో విగతజీవిగా కనిపించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఇది ఆత్మహత్య కాదని, ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యేనని వారు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. తమకు అధికారుల నుంచి ఎలాంటి సమాచారం అందలేదని, మీడియా ద్వారానే విషయం తెలుసుకుని హుటాహుటిన ఇక్కడికి వచ్చామని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఏపీకి 11.91 లక్షల కోట్ల పెట్టుబడులు



వైజాగ్: విశాఖపట్నం వేదికగా జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు కూటమి ప్రభుత్వానికి భారీ విజయాన్ని అందించింది. ఈ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తరలివచ్చాయి. మొత్తం 400 అవగాహన ఒప్పందాల (ఎంఓయూ) ద్వారా సుమారు రూ. 11,91,972 కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం ఆకర్షించింది. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలో 13,32,445 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రభుత్వం ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన రావడంతో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. సదస్సు ప్రారంభమైన తొలిరోజే రూ. 8.26 లక్షల కోట్ల పెట్టుబడులతో ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా 12.05 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. ఇక రెండో రోజు ముఖ్యమంత్రి సమక్షంలో 41 ఎంఓయూల ద్వారా రూ. 3.50 లక్షల కోట్లు, ఇతర మంత్రుల సమక్షంలో 324 ఒప్పందాల ద్వారా రూ. 8.41 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ఇంధనం, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు–వాణిజ్యం, ఏపీ సీఆర్డీఏ, మున్సిపల్ శాఖల పరిధిలో ఈ కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ సదస్సు విజయవంతం కావడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 400 ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు జరిగిన ఒప్పందాల ద్వారా రూ. 11,91,972 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. 13,32,445 ఉద్యోగాలపై హామీ పొందింది. ఇవీ గత రెండు రోజులుగా వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూల విలువ. మొత్తంగా 7 రంగాల్లో భారీగా పెట్టుబడులు వచ్చాయి. ఏపీసీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐ అండ్ ఐ, పరిశ్రమలు – వాణిజ్యం, ఐటీ, మున్సిపల్ శాఖల్లో ప్రభుత్వం వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో విశాఖ సమ్మిట్ మొదటి రోజునే బిగ్ హిట్ అయింది. ప్రభుత్వ అంచనాలకు మించి పరిశ్రమలు స్పందించాయి. మొత్తంగా 410 ఎంఓయూల ద్వారా రూ. 10 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసుకుంది. అయితే ఆ అంచనాలకు మించి పారిశ్రామిక వేత్తల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. భాగస్వామ్య సదస్సుకు ముందు రోజే భారీ ఎత్తున పెట్టుబడులు రాగా సదస్సు రెండో రోజున అంతకు మించిన స్పందన కన్పించింది. సదస్సు తొలి రోజైన శుక్రవారం నాడు 365 ఎంఓయూలు కుదుర్చుకోగా... వీటి ద్వారా రూ. 8,26,668 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. అలాగే ఈ ఎంఓయూల ద్వారా 12,05,175 మందికి ఉద్యోగాలు ఇచ్చేలా వివిధ పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. ఇదంతా ఒక్క రోజులోనే జరిగింది.

## మంత్రుల సమక్షంలోనూ భారీగా ఒప్పందాలు...

ఇక వివిధ శాఖలకు చెందిన మంత్రులు కూడా భాగస్వామ్య సదస్సు తొలి రోజున భారీ ఎత్తున ఒప్పందాలు చేసుకుని భారీ పెట్టుబడులను రాబట్టారు. మంత్రులందరూ కలిసి మొత్తంగా 324 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని రూ. 4,76,482 కోట్లు పెట్టుబడులకు హామీ పొందారు. ఈ ఒప్పందాల ద్వారా 7,88,884 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. తొలి రోజు సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న మంత్రుల్లో నారా లోకేశ్, టీజీ భరత్, గొట్టిపాటి రవి, బీసీ జనార్ధన్ రెడ్డి, నారాయణ ఉన్నారు. నారా లోకేశ్ రూ. 1,38,752 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకోగా... మిగిలిన మంత్రులు కూడా భారీ ఎత్తున ఎంఓయూలు కుదుర్చుకున్నారు.

**రెండు రోజుల్లో రంగాల వారీ పెట్టుబడి వివరాలిలా...**

**విద్యుత్ రూ. 5,11,502 కోట్ల పెట్టుబడులు 245222 మందికి ఉద్యోగాలు**
**ఐఅండ్ఐ రూ. 2,05,008 కోట్ల పెట్టుబడులు 3,05,574 మందికి ఉద్యోగాలు**
**సీఆర్డీఏ రూ. 50,511 కోట్ల పెట్టుబడులు 42,225 మందికి ఉద్యోగాలు**
**మున్సిపల రూ. 4,944 కోట్ల పెట్టుబడులు 12,150 మందికి ఉద్యోగాలు**
**ఫుడ్ ప్రాసెసింగ్ రూ. 13,009 కోట్ల పెట్టుబడులు 47,390 మందికి ఉద్యోగాలు**
**పరిశ్రమలు వాణిజ్యం రూ. 2,68,248 కోట్ల పెట్టుబడులు 4,23,869 మందికి ఉద్యోగాలు**
**ఐటీ రూ. 1,38,752 కోట్ల పెట్టుబడులు 2,56,015 మందికి ఉద్యోగాలు.**

## ముఖ్యమంత్రి సమక్షంలో...

భాగస్వామ్య సదస్సు సందర్భంగా గత రెండు రోజుల్లో సీఎం సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ. 7,15,490 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 5,42,761 మంది ఉద్యోగాలకు హామీ పొందింది రాష్ట్ర ప్రభుత్వం. భాగస్వామ్య సదస్సు తొలి రోజున వివిధ రంగాలకు చెందిన కంపెనీలతో ముఖ్యమంత్రి వరుస భేటీలు నిర్వహించారు. గురువారం వరుసగా 15 భేటీలు నిర్వహిస్తే.. శుక్రవారం కూడా దాదాపు అదే స్థాయిలో ముఖ్యమంత్రి వరుస సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం సీఎం సమక్షంలో ఎంఓయూలు చేసుకున్న సంస్థల్లో ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్, ఎకోరెన్ ఎనర్జీ, జాక్సన్ గ్రీన్, జీఎంఆర్ ఎనర్జీ, ఎస్సార్ రెన్యువబుల్స్, వారీ గ్రూప్, సీసన్ గ్లోబల్ ట్రేడింగ్, ఎస్ఏఈఎల్, జేఎం బాక్సీ, శ్రీ సిమెంట్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, టాటా పవర్, పతంజలి ఫుడ్, ఇండస్ కాఫీ, కెల్లాగ్ ఇండియా తదితర సంస్థలు ఉన్నాయి. ఇక విడివిడి భేటీల్లో రాష్ట్రంలో ఉన్న పెట్టుబుడులను ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులకు ఆసాంతం వివరిస్తూ... పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. అలాగే పారిశ్రామికాభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు. వీటితో పాటు.. కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి రాయితీలు వచ్చే పరిస్థితి ఉంటే.. వాటిని కూడా వచ్చేలా తాము సహకరిస్తామని సీఎం ఆయా కంపెనీల ప్రతినిధులకు వివరించారు. భాగస్వామ్య సదస్సు తొలిరోజు జరిగిన ఒప్పందాల కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధనరెడ్డి, సీఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# టైగర్ అభీ జిందా హై

**నితీశ్ కుమార్ తిరుగులేని విజయం**

**విమర్శకుల నోళ్లు మూయించిన బీహార్ సీఎం**



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు పాట్నాలోని జనతాదళ్ (యునైటెడ్) కార్యాలయం వెలుపల వెలసిన ఓ భారీ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. "టైగర్ అభీ జిందా హై" (పులి ఇంకా బతికే ఉంది) అన్నదే దాని సారాంశం. శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమై, ఫలితాల సరళి వెలువడుతున్న కొద్దీ ఆ నినాదం కేవలం ప్రచారం కోసం కాదని, బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెక్కుచెదరని శక్తికి నిదర్శనమని స్పష్టమవుతోంది. ఎన్నికల సంఘం వెల్లడిస్తున్న ట్రెండ్స్ ప్రకారం, ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. మొత్తం 243 స్థానాలున్న అసెంబ్లీలో, మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీఏ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికే 200కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది. ఈ భారీ ఆధిక్యం కేవలం కూటమి లెక్కలనే కాకుండా, బీహార్‌లో ఎన్డీఏకు నితీశ్ కుమారే అసలైన గుర్తింపు అనే వాస్తవాన్ని మరోసారి రుజువు చేసింది. 1951లో పాట్నా జిల్లాలోని భక్తియార్‌పూర్‌లో ఓ సాధారణ కుటుంబంలో నితీశ్ కుమార్ జన్మించారు. ఆయన తండ్రి కవిరాజ్ రామ్ లఖన్ సింగ్ ఆయుర్వేద వైద్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు. బిహార్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ప్రస్తుతం ఎన్ఐటీ పాట్నా) నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందిన ఆయన, జేపీ ఉద్యమం స్ఫూర్తితో సోషలిస్టు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కేంద్ర మంత్రిగా పలు శాఖలు నిర్వహించి, చివరకు బిహార్ ముఖ్యమంత్రిగా తనదైన ముద్ర వేశారు. నితీశ్ పాలన గురించి చెప్పాలంటే, 2005కు ముందు రాష్ట్రాన్ని పట్టిపీడించిన 'జంగిల్ రాజ్'ను ప్రస్తావించాల్సిందే. లాలూ ప్రసాద్ యాదవ్ పాలనలో (1990-2005) బీహార్ అరాచకానికి, కుల ఘర్షణలకు, రాజకీయ నేరాలకు కేంద్రంగా మారింది. "భూరాబల్ సాఫ్ కరో" (భూమిహార్, రాజ్‌పుత్, బ్రాహ్మణ, లాలా అనే నాలుగు అగ్ర కులాలను తుడిచిపెట్టండి) వంటి నినాదాలు ఆ కాలంలోనే పుట్టుకొచ్చాయి. అలాంటి భయానక వాతావరణం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించి, శాంతిభద్రతలను నెలకొల్పిన ఘనత నితీశ్‌కే దక్కుతుందని విశ్లేషకులు చెబుతారు. "శారీరకంగా అలసిపోయారు, మానసికంగా రిటైర్ అయ్యారు" అంటూ జన్ సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వంటి వారు నితీశ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన బీజేపీకి కేవలం ఒక 'మాస్క్'గా మిగిలిపోయారని ఆరోపించారు. అయితే ఈ ఎన్నికల ఫలితాలు ఆ విమర్శలను పటాపంచలు చేశాయి. మహిళలు రికార్డు స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం (తొలి దశలో 69%, రెండో దశలో 74%), ఈబీసీ/మహాదళితుల వంటి బలమైన సామాజిక వర్గాలు ఆయన వెంటే నిలవడం నితీశ్ గెలుపులో కీలక పాత్ర పోషించాయి. 2016లో సంపూర్ణ మద్యపాన నిషేధం, మహిళా విద్యకు ప్రోత్సాహం, రహదారుల నిర్మాణం, గ్రామీణ సేవలు, సంక్షేమ పథకాలు వంటివి ఆయన పాలనకు బలాన్నిచ్చాయి. తన రాజకీయ ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశారు. బీజేపీతో పొత్తు, ఆ తర్వాత విడిపోవడం, 2014 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లకే పరిమితమవడం వంటివి ఆయనకు ఎదురుదెబ్బలే. అయినా తన రాజకీయ చాతుర్యంతో మళ్లీ నిలదొక్కుకుని రికార్డు స్థాయిలో 9వ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో జేడీ(యూ) కన్నా బీజేపీ ఎక్కువ స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇది కూటమిలో బీజేపీ 'పెద్దన్న' పాత్ర పోషిస్తోందనడానికి సంకేతం. అయినప్పటికీ, బిహార్‌లో ఎన్డీఏ విజయానికి నితీశ్ కుమారే చోదకశక్తి అని, ఆ కూటమికి ఆయనే మస్కట్ అని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి.

## కీవ్‌పై రష్యా క్షిపణుల వర్షం

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా మరోసారి విరుచుకుపడింది. శుక్రవారం ఉదయం నగరంపై క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడికి పాల్పడింది. ఈ 'భారీ దాడి'లో కీవ్‌లోని దాదాపు అన్ని జిల్లాలు లక్ష్యంగా మారాయని, కీలక మౌలిక వసతులు, నివాస భవనాలు ధ్వంసమయ్యాయని నగర మేయర్ విటాలీ క్లిట్ష్కో తెలిపారు. ఈ ఘటనలో కనీసం 11 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఐదుగురిని ఆసుపత్రికి తరలించామని, వీరిలో ఒక గర్భిణి కూడా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ఒకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని తెలిపారు. రష్యా దాడుల్లో నగరంలోని తాపన వ్యవస్థలకు (హీటింగ్ నెట్‌వర్క్‌లు) తీవ్ర నష్టం వాటిల్లిందని, దీంతో ఈశాన్యంలోని డెస్న్యాన్స్కీ జిల్లాలోని కొన్ని భవనాలకు తాత్కాలికంగా హీటింగ్ సరఫరా నిలిచిపోయిందని మేయర్ క్లిట్ష్కో వివరించారు. విద్యుత్, నీటి సరఫరాకు కూడా అంతరాయం కలగవచ్చని ఆయన హెచ్చరించారు. కీవ్‌లోని దాదాపు ప్రతి జిల్లాలోనూ ఎత్తైన భవనాలు దెబ్బతిన్నాయని నగర సైనిక పరిపాలన అధిపతి తైమూర్ తకచెంకో సోషల్ మీడియాలో పేర్కొన్నారు. 2022లో పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన రష్యా, ఇటీవలి నెలల్లో ఉక్రెయిన్‌లోని ఇంధన సౌకర్యాలు, రైల్వే వ్యవస్థలతో పాటు నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులను తీవ్రతరం చేసింది. శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వ్యూహంలో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. నగరంలోని 10 జిల్లాల్లో 8 చోట్ల భవనాలు దెబ్బతినడమో లేదా మంటలు చెలరేగడమో జరిగిందని, అన్ని చోట్లకు అత్యవసర వైద్య బృందాలను పంపామని అధికారులు తెలిపారు. ఈ దాడి జరగడానికి కొన్ని రోజుల ముందే రష్యాపై పాశ్చాత్య దేశాలు ఒత్తిడి పెంచాయి. రష్యా డ్రోన్, ఇంధన ఉత్పత్తిపై కెనడా కొత్త ఆంక్షలు విధించింది. జీ7 దేశాల విదేశాంగ మంత్రులు ఉక్రెయిన్‌లో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, స్తంభింపజేసిన రష్యా ఆస్తుల నుంచి వచ్చే ఆదాయాన్ని ఉక్రెయిన్‌కు రుణం రూపంలో అందించే ప్రతిపాదనను యూరోపియన్ కమిషన్ పరిశీలిస్తోంది. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇరుపక్షాలు వెనక్కి తగ్గడం లేదు. కాల్పుల విరమణ ప్రతిపాదనలను మాస్కో తిరస్కరిస్తూ వస్తోంది.

## భారత్‌తో దోస్తీ ప్రపంచానికే లాభం

**విశాఖలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్**




వైజాగ్: బలమైన ఆర్థిక బంధాలను ఏర్పరుచుకుంటున్న తరుణంలో భారత్‌తో భాగస్వామ్యం కావడం ద్వారా ప్రపంచ దేశాలు ఎంతో ప్రయోజనం పొందుతాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా ఉమ్మడి శ్రేయస్సుకు దారితీస్తుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ, నూతన భౌగోళిక-ఆర్థిక క్రమంలో భారత్ తనదైన శైలిలో ముందుకు సాగుతోందని తెలిపారు. సాంకేతికత ద్వారా శ్రేయస్సు, నైతికత ద్వారా విశ్వాసం, సామర్థ్యం ద్వారా వాణిజ్యం అనే మూడు సూత్రాలతో ప్రగతి పథంలో పయనిస్తోందని వివరించారు. అంతర్జాతీయ సహకారాన్ని విస్తృతం చేసేందుకు ఆయన మూడు కీలక సిఫార్సులను ప్రతిపాదించారు. ద్వైపాక్షిక పెట్టుబడులను సులభతరం చేయడం, సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడం, పరస్పర విశ్వాసాన్ని నిర్మించి, నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశ ప్రగతి గాథ విశ్వాసం, పారదర్శకత, ఆవిష్కరణలు, సమ్మిళిత వృద్ధి అనే స్తంభాలపై నిర్మితమైందని గోయల్ కొనియాడారు. ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందుతూ, ప్రతి పౌరుడు ఉన్నత జీవన ప్రమాణాలను పొందేలా, భారత్‌ను ఒక అభివృద్ధి చెందిన, సంపన్న దేశంగా చూడాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. దార్శనిక నాయకత్వం కింద విశాఖపట్నం గొప్ప వారసత్వం, ఆధునిక ఆవిష్కరణలతో కూడిన ప్రపంచ వాణిజ్య కేంద్రంగా అవతరించిందని, ఇది భారతదేశ వృద్ధి కథను ప్రపంచంతో అనుసంధానిస్తోందని ప్రశంసించారు. పారదర్శక పాలన, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను ప్రోత్సహించే విధానాల ద్వారా విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, దార్శనిక నాయకత్వం, ప్రజాస్వామ్య బలం కారణంగా భారతదేశం ప్రపంచంలోనే అత్యంత ప్రాధాన్యత కలిగిన పెట్టుబడుల గమ్యస్థానంగా ఎదుగుతోందని అన్నారు. వ్యూహాత్మక తీరప్రాంతం, సులభతర వాణిజ్యంలో నిరూపితమైన ట్రాక్ రికార్డుతో ఆంధ్రప్రదేశ్, భారతదేశ తూర్పు తీరంలో ఒక ముఖద్వారంగా (గేట్‌వే) నిలుస్తోందని అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 11వ స్థానం నుంచి 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతున్న ఈ ప్రయాణంలో, దేశ అప్రతిహత వృద్ధిని, శ్రేయస్సు వాగ్దానాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడానికి బలమైన కారణం ఉందని అన్నారు. "మేము డబుల్ ఇంజిన్, బుల్లెట్ ట్రైన్ ప్రభుత్వాన్ని అందిస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు. తాము ఒక ప్రాజెక్టుకు కట్టుబడితే, అది తమ ఉమ్మడి లక్ష్యంగా మారుతుందని, దానిని సంకల్పంతో ముందుకు తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారు. వ్యాపారాలు కేవలం విజయవంతం కావడమే కాకుండా, వృద్ధి చెందేలా చూసేందుకు అవసరమైన సంస్కరణలను అమలు చేయడానికి కేంద్రంతో కలిసి పనిచేయడానికి తాము పూర్తి సిద్ధంగా ఉన్నామని పెట్టుబడిదారులకు ఆయన భరోసా ఇచ్చారు.

## మూడేళ్లు వాడకపోతే యూజర్ డేటా డిలీట్

**సోషల్ మీడియా, ఈ-కామర్స్, గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు కొత్త రూల్స్.. డేటా డిలీట్ చేసే ముందు యూజర్‌కు 48 గంటల నోటీసు**

న్యూఢిల్లీ: భారతదేశంలో డిజిటల్ వినియోగదారుల డేటా భద్రతకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఒక కీలక ముందడుగు వేసింది. దేశపు మొట్టమొదటి డిజిటల్ గోప్యతా చట్టమైన 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) యాక్ట్' కింద నూతన నిబంధనలను నోటిఫై చేసింది. ఈ నిబంధనల ప్రకారం.. సోషల్ మీడియా, ఈ-కామర్స్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లను వరుసగా మూడేళ్లపాటు వినియోగించని యూజర్ల వ్యక్తిగత డేటాను తప్పనిసరిగా తొలగించాల్సి ఉంటుంది. ఈ కొత్త మార్గదర్శకాలు పెద్ద కంపెనీలకు వర్తిస్తాయి. దేశంలో రెండు కోట్ల కంటే ఎక్కువ మంది రిజిస్టర్డ్ యూజర్లు ఉన్న సోషల్ మీడియా, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు, 50 లక్షల కంటే ఎక్కువ మంది వినియోగదారులు ఉన్న ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు ఈ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. డేటాను తొలగించడానికి ముందు, సంబంధిత యూజర్‌కు 48 గంటల గడువుతో నోటీసు ఇవ్వాలి. ఆ సమయంలోగా ప్లాట్‌ఫామ్‌ను వినియోగించకపోతే వారి డేటా శాశ్వతంగా తొలగించబడుతుందని స్పష్టం చేయాలి. 50 లక్షల కంటే ఎక్కువ యూజర్లు ఉన్న డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను 'ముఖ్యమైన డేటా సంరక్షకులు' గా వర్గీకరించారు. వీటికి మరింత కఠినమైన నిబంధనలు విధించారు. ఈ సంస్థలు తమ సిస్టమ్స్, అల్గారిథమ్స్, ప్రక్రియలు యూజర్ల హక్కులకు భంగం కలిగించకుండా ఉన్నాయో లేదో నిర్ధారించడానికి ఏటా ఆడిట్ నిర్వహించాలి. దీంతో పాటు 'డేటా ప్రొటెక్షన్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్' కూడా తప్పనిసరి చేశారు. తమ సాంకేతిక భద్రతా ప్రమాణాలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయని ప్రతి సంవత్సరం ధృవీకరించుకోవాలి. ఈ చట్టం ప్రకారం, వ్యక్తిగత డేటాను దేశ సరిహద్దులు దాటించి బదిలీ చేయడానికి అనుమతి ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసే నిబంధనలకు లోబడి ఉండాలి. ముఖ్యంగా విదేశీ ప్రభుత్వాలు లేదా వాటి నియంత్రణలోని సంస్థలకు డేటా బదిలీ చేసే విషయంలో ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఈ కొత్త నిబంధనలతో కంపెనీలు యూజర్ల నుంచి ఎలాంటి సమాచారం సేకరిస్తున్నాయి, దానిని ఎలా ఉపయోగిస్తాయనే దానిపై స్పష్టమైన వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. "డీపీడీపీ నిబంధనల నోటిఫికేషన్‌తో భారతీయ కంపెనీలకు వ్యక్తిగత డేటాను ఎలా సేకరించాలి, భద్రపరచాలి అనే దానిపై స్పష్టమైన మార్గసూచీ లభించింది" అని ఈవై ఇండియా సైబర్‌సెక్యూరిటీ కన్సల్టింగ్ భాగస్వామి మురళీరావు అభిప్రాయపడ్డారు.

## పడిలేచిన కెరటం చిరాగ్ పాశ్వాన్




పాట్నా: ఈ ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కేవలం ఎన్డీయే కూటమి ఘన విజయాన్ని, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్-ప్రధాని నరేంద్ర మోదీ ద్వయం ప్రభావాన్ని మాత్రమే కాదు, ఒక యువనేత రాజకీయ ఆవిర్భావాన్ని కూడా బలంగా చాటిచెప్పాయి. ఆయనే లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్. సోషలిస్ట్ దిగ్గజాల శకం తర్వాత బీహార్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా ఆయన నిలిచారు. ఎన్డీయే కూటమిలో గట్టిగా బేరమాడి 29 అసెంబ్లీ స్థానాలను దక్కించుకున్న చిరాగ్, ఏకంగా 21 స్థానాల్లో తన పార్టీ అభ్యర్థులను ఆధిక్యంలో నిలిపి తన సత్తా ఏమిటో నిరూపించుకున్నారు. అంటే దాదాపు 72 శాతం స్ట్రైక్ రేట్‌తో ఆయన ఈ విజయాన్ని నమోదు చేశారు. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదుకు ఐదు స్థానాల్లో గెలిచిన తర్వాత, ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే జోరును కొనసాగించడం ఆయన రాజకీయ పలుకుబడిని అమాంతం పెంచింది. 2020 అసెంబ్లీ ఎన్నికల సమయంలో చిరాగ్ పాశ్వాన్ రాజకీయ భవిష్యత్తు అంధకారంగా కనిపించింది. జేడీయూ అధినేత నితీశ్ కుమార్‌తో విభేదాల కారణంగా ఒంటరిగా బరిలోకి దిగిన ఆయన పార్టీ, 130కి పైగా స్థానాల్లో పోటీ చేసి కేవలం ఒక్క సీటు మాత్రమే గెలుచుకుంది. జేడీయూ ఓటమికి పలుచోట్ల కారణమైనప్పటికీ, దివంగత నేత, బీహార్ రాజకీయాల్లో ఓ మహాశక్తిగా వెలుగొందిన రామ్ విలాస్ పాశ్వాన్ వారసత్వాన్ని ముందుకు నడిపించే సత్తా, కరిష్మా చిరాగ్‌కు లేవని చాలామంది విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఆ గాయం మానకముందే, 2021లో సొంత బాబాయ్ పశుపతి కుమార్ పారస్ పార్టీని చీల్చి, రామ్ విలాస్ పాశ్వాన్ వారసత్వం కోసం పోటీపడటంతో చిరాగ్ పరిస్థితి మరింత దిగజారింది. అయితే, అక్కడి నుంచే ఆయన అద్భుతంగా పుంజుకున్నారు. 43 ఏళ్ల చిరాగ్, తనను తాను 'యువ బిహారీ'గా ప్రాజెక్ట్ చేసుకుంటూనే, తన పార్టీ మూలాలైన దళిత సమస్యలపై గట్టిగా పోరాడారు. ఈ కృషి ఫలితమే 2024 లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం విజయంగా నిలిచింది.

## ట్రంప్‌కు బీబీసీ క్షమాపణలు

**ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేసినందుకు విచారం**

**1 బిలియన్ డాలర్ల నష్టపరిహారం**

**ఇచ్చేది లేదని స్పష్టీకరణ**




న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రఖ్యాత మీడియా సంస్థ బీబీసీ (బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్) గురువారం క్షమాపణలు తెలిపింది. అయితే, ఆయన డిమాండ్ చేసిన 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 8,300 కోట్లు) నష్టపరిహారాన్ని చెల్లించేందుకు మాత్రం నిరాకరించింది. 2021 జనవరి 6న ట్రంప్ చేసిన ప్రసంగాన్ని తప్పుగా ఎడిట్ చేసి తమ డాక్యుమెంటరీలో చూపించామని అంగీకరిస్తూ, ఈ మేరకు శ్వేతసౌధానికి బీబీసీ ఛైర్మన్ సమీర్ షా స్వయంగా లేఖ రాశారు. 2024 అమెరికా అధ్యక్ష ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీబీసీ తన ఫ్లాగ్‌షిప్ సిరీస్ 'పనోరమా'లో "ట్రంప్: ఎ సెకండ్ ఛాన్స్?" అనే పేరుతో ఒక డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. ఇందులో 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్ భవనంపై దాడికి ముందు ట్రంప్ చేసిన ప్రసంగానికి సంబంధించిన వీడియోను ఉపయోగించారు. అయితే, దాదాపు గంట వ్యవధిలో ట్రంప్ మాట్లాడిన వేర్వేరు భాగాలను కలిపి, ఒకేసారి మాట్లాడినట్లుగా చూపించారు. ట్రంప్ తన మద్దతుదారులను ఉద్దేశించి "నాతో పాటు కవాతు చేయండి", "పిడికిలి బిగించి పోరాడండి" అన్న మాటలను ఒకే వాక్యంగా ఎడిట్ చేశారు. కానీ, తన మద్దతుదారులు శాంతియుతంగా నిరసన తెలియజేయాలని ఆయన కోరిన భాగాన్ని తొలగించారు. ఈ ఎడిటింగ్ వల్ల ట్రంప్ నేరుగా హింసకు పిలుపునిచ్చినట్లు పొరపాటున అర్థం వచ్చేలా ఉందని బీబీసీ తన ప్రకటనలో అంగీకరించింది. "వేర్వేరు భాగాలను కలిపి చూపడం ద్వారా, అది ఒకే ప్రసంగం అనే తప్పుడు అభిప్రాయాన్ని మా ఎడిటింగ్ ఉద్దేశపూర్వకంగా కాకుండానే కలిగించిందని మేము అంగీకరిస్తున్నాము" అని పేర్కొంది. ఈ వివాదం బీబీసీ ప్రతిష్టను దెబ్బతీస్తోందని, దీనికి పూర్తి బాధ్యత తనదేనని పేర్కొంటూ డైరెక్టర్-జనరల్ టిమ్ డేవి, న్యూస్ చీఫ్ డెబోరా టర్నెస్ ఆదివారం తమ పదవులకు రాజీనామా చేశారు. వివాదాస్పదమైన ఈ డాక్యుమెంటరీని మళ్లీ ప్రసారం చేసే ప్రణాళికలు లేవని బీబీసీ స్పష్టం చేసింది. ఈ డాక్యుమెంటరీ వల్ల తనకు తీవ్రమైన ఆర్థిక నష్టం, ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆరోపిస్తూ ట్రంప్ తరఫు న్యాయవాది బీబీసీకి లేఖ రాశారు. 1 బిలియన్ డాలర్ల నష్టపరిహారంతో పాటు బహిరంగ క్షమాపణ చెప్పాలని, డాక్యుమెంటరీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారంలోగా స్పందించాలని గడువు విధించారు. దీనికి స్పందనగా బీబీసీ క్షమాపణ చెప్పినప్పటికీ, నష్టపరిహారం చెల్లించే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. అయితే, న్యాయ నిపుణుల ప్రకారం ఈ కేసును యూకే లేదా యూఎస్ కోర్టులలో గెలవడం ట్రంప్‌కు సవాలుతో కూడుకున్నది.

## బీహార్‌లో మజ్లిస్‌కు 5 సీట్లు

**గెలవడంపై స్పందించిన అసదుద్దీన్**



హైదరాబాద్, నవంబర్ 14 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ ఐదు స్థానాల్లో గెలుపొందడంపై మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. ఈరోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌ను గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ దిగజారిపోయిన పార్టీ అని ఆయన అన్నారు. తనను విమర్శిస్తే బలపడతానని బీఆర్ఎస్ భావిస్తోందని అన్నారు. అజారుద్దీన్‌పై ఉన్న కోపాన్ని తనను విమర్శించడం ద్వారా తీర్చుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్‌లో ఐదు స్థానాల్లో తమ పార్టీ విజయం సాధించిందని అసదుద్దీన్ తెలిపారు. తమకు ఓటు వేసిన బీహార్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ఐదు స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులు, పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారని ఆయన ప్రశంసించారు. బీహార్ ప్రజలు ఇచ్చిన తీర్పును స్వీకరిస్తున్నామని ఆయన అన్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు అసదుద్దీన్ అభినందనలు తెలిపారు. మజ్లిస్ పార్టీ ప్రజల అభ్యున్నతి కోసమే పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీని ఆపే శక్తి ఆర్జేడీకి లేదని ఆయన అన్నారు.

## రాహుల్ గాంధీకి 95వ ఓటమి

**అవార్డులు ఉంటే అన్నీ ఆయనకే దక్కేవి!: బీజేపీ ఎద్దేవా**



న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైంది. దేశవ్యాప్తంగా జరిగిన పలు ఉప ఎన్నికల్లోనూ ఆశించిన ఫలితాలు సాధించలేకపోయింది. అయితే, తెలంగాణలోని జూబ్లీహిల్స్, రాజస్థాన్‌లోని అంటా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్ ఓటమి పాలుకావడమే కాకుండా, కాంగ్రెస్ కేవలం 5 స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు గుప్పించింది. గత రెండు దశాబ్దాలలో జరిగిన ఎన్నికల్లో రాహుల్ గాంధీ 95 సార్లు ఓడిపోయారని బీజేపీ నేత అమిత్ మాలవీయ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ కీలక స్థానాన్ని చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాలలో ఆ పార్టీ 95 సార్లు ఓడిపోయినట్లు చూపే మ్యాప్‌ను మాలవీయ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. 2004 నుంచి 2025 వరకు జరిగిన వివిధ ఎన్నికల్లో రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ అనేకమార్లు విఫలమైందని, ఇది రాహుల్ గాంధీకి మరో ఎన్నిక, మరో ఓటమి అని మాలవీయ వ్యాఖ్యానించారు. బీహార్‌లో తాజాగా ఎదురైన ఓటమితో రాహుల్ 95 సార్లు ఓడిన రికార్డును సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ఓటముల్లో అవార్డులు ఉంటే అవన్నీ ఆయనకే దక్కేవని, రాహుల్ గాంధీ వరుస పరాజయాలను చూసి ఓటమి కూడా ఆశ్చర్యపోక తప్పదని ఎద్దేవా చేశారు.

## 8 రాష్ట్రాల్లో ఉపఎన్నికల ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరిగాయి. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు ప్రాంతీయ పార్టీలు విజయాలు సాధించాయి. తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. జమ్ముకశ్మీర్‌లో రెండు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు జరగగా, ఒకచోట బీజేపీ, మరోచోట పీడీపీ గెలుపొందాయి. రాజస్థాన్‌లోని అంటా నియోజకవర్గంతో పాటు తెలంగాణలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం సాధించింది. జమ్ము కశ్మీర్‌లోని బద్గామ్ నియోజకవర్గంలో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఆగా సయ్యద్ ముంతజీర్ మెహ్దీ, నగ్రోటా నుంచి బీజేపీ అభ్యర్థి దేవయాని రాణా గెలుపొందారు. ఝార్ఖండ్‌లోని ఘట్సిల నియోజకవర్గంలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా అభ్యర్థి సోమేశ్ చంద్రసోరెన్, మిజోరాంలోని డంపా నుంచి మిజో నేషనల్ ఫ్రంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్ లల్తాంగ్లియానా, ఒడిశాలోని నౌపడ నుంచి బీజేపీ అభ్యర్థి జై దొలాకియా, పంజాబ్‌లోని తర్ణ్ తారన్ నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి హర్మీత్ సింగ్ సందు గెలుపొందారు.

## మాకు ఇది ఒక పాఠం

**బీహార్ ఎన్నికల ఫలితాలపై డీ.కె. శివకుమార్**

బెంగళూరు: బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీ.కె. శివకుమార్ స్పందించారు. కాంగ్రెస్, ఇండియా కూటమి కోసం కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్‌బంధన్ భారీ ఓటమి నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, ఈ ఫలితాలు తమ పార్టీకి, మిత్రపక్షాలకు ఒక గుణపాఠం అని పేర్కొన్నారు. "ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు. మాకు ఇది ఒక పాఠం. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమికి కొత్త వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను" అని డీ.కె. శివకుమార్ అన్నారు. మహిళా సాధికారత, స్వయం ఉపాధి కింద మహిళలకు రూ. 10,000 చొప్పున జమ చేయడం, మహిళా ఓటర్ల పెరుగుదల ఎన్డీయే కూటమి గెలుపుకు కారణమని భావిస్తున్నారా? అని మీడియా ప్రశ్నించగా, ఫలితాలు వచ్చాక కారణాలేమిటో తెలియాల్సి ఉందని శివకుమార్ అన్నారు. పూర్తి ఫలితాలు వచ్చాక మళ్లీ మాట్లాడతానని ఆయన చెప్పారు. మహాఘట్‌బంధన్ ఓటమిపై కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ స్పందించారు. బీహార్ ఫలితాలు తమను నిరాశపరిచాయని ఆయన అన్నారు. రాష్ట్రంలోని ప్రతి మహిళకు ప్రభుత్వం రూ. 10 వేలు పంపిణీ చేసిందని ఆయన ఆరోపించారు. ఎన్నికల ప్రచారం కొనసాగుతున్నప్పుడు కూడా ఇది కొనసాగిందని ఆరోపించారు.

## లాభాల్లోకి దూసుకెళ్లిన మార్కెట్లు

ముంబై: బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం దిశగా దూసుకెళ్లడంతో, భారత ఈక్విటీ మార్కెట్లు నష్టాల నుంచి కోలుకుని స్వల్ప లాభాలతో ముగిశాయి. ఓట్ల లెక్కింపు రోజంతా కొనసాగడంతో, సూచీలు తీవ్రమైన ఒడుదొడుకులకు లోనయ్యాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 84.11 పాయింట్లు లాభపడి 84,562.78 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 30.90 పాయింట్లు పెరిగి 25,910.05 వద్ద ముగిసింది. శుక్రవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైనప్పుడు, బీహార్ ఎన్నికల ఫలితాలపై నెలకొన్న అనిశ్చితితో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో గురువారం ముగింపు 84,478.67తో పోలిస్తే, సెన్సెక్స్ 84,060.14 వద్ద నష్టాలతో మొదలై, ఒక దశలో 400 పాయింట్లకు పైగా పడిపోయింది. అయితే, ఎన్డీఏ భారీ మెజారిటీ సాధిస్తుందన్న అంచనాలు బలపడటంతో మార్కెట్లలో సానుకూల వాతావరణం ఏర్పడింది. రోజు కనిష్ఠ స్థాయి నుంచి సూచీ ఏకంగా 550 పాయింట్లకు పైగా పుంజుకుని లాభాల్లోకి మళ్లింది. "భారత మార్కెట్లు ఈరోజు రోలర్-కోస్టర్ సెషన్‌ను చవిచూశాయి. బెంచ్‌మార్క్ సూచీ నిఫ్టీ పదునైన కదలికలను ప్రదర్శించింది. మొదటి అర్ధభాగంలో కీలకమైన 26,000 స్థాయిని పరీక్షించినప్పటికీ, ఆ తర్వాత ఒత్తిడికి గురైంది" అని ఆషికా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన నివేదికలో పేర్కొంది. రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన బీహార్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రోజంతా మార్కెట్లలో అస్థిరత కొనసాగింది.


ఈవార్తలు
# వినోదవాణి CINEMA
శనివారం 15-11-2025 www.evarthalu.com


లహరి చిత్రం




## ఇంజెక్షన్ల రూమర్లపై తమన్నా ఏమన్నదంటే..

ఫిలిం ఇండస్ట్రీలో మిల్కీ బ్యూటీగా పేరు సొంతం చేసుకుని అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ దక్కించుకుంది తమన్నా భాటియా. శ్రీ అనే సినిమాతో సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈమె.. హ్యాపీడేస్ సినిమాతో భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ప్రభాస్, రామ్ చరణ్ , అల్లు అర్జున్, నాగచైతన్య వంటి హీరోలతో కలిసి నటించడమే కాకుండా చిరంజీవి వంటి సీనియర్ హీరోలతో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించింది. ముఖ్యంగా రెండు తరాల హీరోలతో స్క్రీన్ పంచుకున్న హీరోయిన్స్ జాబితాలో ఒకరిగా పేరు సొంతం చేసుకుంది తమన్నా. ఇదిలా ఉండగా సడన్గా బరువు పెరిగిపోయి మళ్లీ బరువు తగ్గడంతో ఈమెపై కొన్ని రకాల రూమర్స్ స్ప్రెడ్ అయిన విషయం తెలిసిందే. అందంగా, స్లిమ్ముగా కనిపించడం కోసం గత కొన్ని సంవత్సరాలుగా తమన్న ఇంజక్షన్ వాడుతోంది అంటూ పెద్ద ఎత్తున రూమర్స్ వైరల్ అయ్యాయి. దీనికి తోడు తన ప్రియుడు విజయ్ వర్మతో ప్రేమలో ఉన్నప్పుడు ఫిట్నెస్ పై ఫోకస్ పెట్టని ఈమె... సడన్ గా లవ్ లో బ్రేకప్ అయిన తర్వాత మళ్లీ కెరియర్ పై ఫోకస్ పెట్టడానికి జిమ్ లో తెగ కష్టపడుతూ ఫిట్నెస్ పై ఫోకస్ పెట్టింది అంటూ పెద్ద ఎత్తున వార్తలు వైరల్ చేస్తున్నారు.





## కీర్తి సురేశ్ 'రివాల్వర్ రీటా' ట్రైలర్ రిలీజ్

విభిన్న పాత్రలతో దూసుకుపోతున్న అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. ఈ సినిమాకు కె. చంద్రు దర్శకత్వం వహిస్తుండగా.. సీనియర్ నటి రాధికా శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్ను విడుదల చేశారు మేకర్స్. కీర్తి సురేశ్ ఈ సినిమాలో 'రీటా' అనే సామాన్య మధ్యతరగతి యువతి పాత్రలో కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల కారణంగా ఆమె తుపాకీ (రివాల్వర్) పట్టుకోవాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె ఎలాంటి సాహసాలు, సవాళ్లు ఎదుర్కొంది అనేది ప్రధాన కథాంశం. ఇది కామెడీ అంశాలతో కూడిన పక్కా యాక్షన్ థ్రిల్లర్ చిత్రంగా రాబోతుంది.




## 'అఖండ 5'కు కూడా బాలయ్య రెడీ: తమన్



బాలకృష్ణ – బోయపాటి శ్రీను కలయికలో రూపొందుతోన్న పాన్ ఇండియా చిత్రం 'అఖండ 2: తాండవం'. ఆది పినిశెట్టి, జగపతిబాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంయుక్తా మేనన్ కథానాయిక. డిసెంబరు 5న విడుదల కానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీనిలోని అఖండ తాండవం పాటను విడుదల చేశారు. ముంబయిలో జరిగిన ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్లో బాలకృష్ణ సందడి చేశారు. బాలకృష్ణ మాట్లాడుతూ తనకు దైవం అంటే ఎంతో నమ్మకముందన్నారు. "బోయపాటి దర్శకత్వంలో నేను నాలుగు సినిమాలు చేశా. మా ఇద్దరిది హిట్ కాంబో. అఖండ సినిమా రూ.250 కోట్లు వసూళ్లు చేసింది. నా సినిమాలన్నీ విజయం సాధిస్తున్నాయి. ఆ భగవంతుడే నా వెనక ఉండి నడిపిస్తున్నాడు. తమన్ అద్భుతమైన సంగీతం అందిస్తున్నాడు. ఆయనకు నా ఇంటి పేరు ఇచ్చా. 5 సినిమాలకు వరుసగా తమన్ సంగీతం అందించాడు" అని తమన్పై బాలకృష్ణ ప్రశంసలు కురిపించారు. "ఇది కేవలం సినిమా కాదు.. ఇది ఒక భారతదేశానికి ఆత్మతో సమానం. ఇది మన ధర్మం. కుటుంబం మొత్తం కలిసి చూసే సినిమా. బాలయ్యతో నా జర్నీ నాలుగు సినిమాలుగా సాగుతోంది. అత్యంత శీతల వాతావరణంలో మేం షూటింగ్ చేశాం. ఉదయం 7న ప్రారంభించి రాత్రి 9 వరకూ కంటిన్యూగా షూటింగ్ చేశాం. అలాంటి వాతావరణంలో మేమంతా స్వెట్టర్లు వేసుకుని జాగ్రత్తలు తీసుకున్నాం. బాలకృష్ణ మాత్రం మాములుగా పంచె కట్టుకుని ఉన్నారంతే. అది ఆయన నిబద్ధతకు నిదర్శనం. మా వెనక ఆ శివయ్యే ఉండి దీన్ని పూర్తి చేయించాడు" అని బోయపాటి శ్రీను చెప్పారు. "లాయల్గా ఉంటూనే రాయల్గా ఉండడం బాలయ్యకే సాధ్యం. అందుకే నాకు ఆయనంటే గౌరవం. ఒకవైపు నటుడిగా అలరిస్తూనే మరోవైపు క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా ఎంతోమందికి సేవ చేస్తున్నారు. ఆయన కలలన్నీ నెరవేరాలని కోరుకుంటున్నా. బాలకృష్ణపై ఉన్న ప్రేమను ఆయన సినిమాలకు సంగీతం అందించి తెలిపే అవకాశం వచ్చింది. ఆయన ఎప్పుడు కలిసినా 'ఈ సినిమాలో కొత్తగా ఏం చేస్తున్నావు' అని అడుగుతారు. అందరూ ఒక పార్ట్లోనే సినిమా అంతా చూపించేశారు కదా.. ఇంక రెండో భాగంలో ఏమి ఉంటుంది అని అంటుంటారు. కానీ, అఖండని ఐదు భాగాలుగా అయినా తీయొచ్చు. దానికి కూడా బాలయ్య సిద్ధంగానే ఉంటారు. శివుడి గురించి ఎంతైనా చెప్పొచ్చు" అని తమన్ అన్నారు.

## ఈ వీకెండ్‌లో ఓటీటీ పండుగే

**ఏకంగా 20 సినిమాలు నెట్టింట్లోకి**

ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి ఏకంగా 20కి పైగా సినిమాలు డిజిటల్ వేదికగా స్ట్రీమింగ్‌కు వచ్చేశాయి. ఇందులో కిరణ్ అబ్బవరం కే ర్యాంప్‌తో పాటు తమిళ చిత్రం డ్యూడ్ చిత్రాలు ఉన్నాయి. ఇక ఏ ఏ సినిమాలు ఎందులో వచ్చాయి అనేది చూసుకుంటే.




**ఆహా: కే ర్యాంప్ (మూవీ) - తెలుగు**

**జియో హాట్‌స్టార్:**

జురాసిక్ వరల్డ్ రీ బర్త్ (మూవీ) – ఇంగ్లీష్, తెలుగు
జాలీ ఎల్ఎల్‌బీ (మూవీ) హిందీ
అవిహితం (మూవీ) మలయాళం




**నెట్‌ఫ్లిక్స్:**

తెలుసు కదా (మూవీ) – తెలుగు
డ్యూడ్ (మూవీ) – తెలుగు, తమిళం
దిల్లీ క్రైమ్: సీజన్3 (వెబ్‌సిరీస్) హిందీ/తెలుగు
ఫ్యూచర్ మ్యాన్ (మూవీ) ఇంగ్లీష్
అన్సెంటియా: సీజన్2 (వెబ్‌సిరీస్) ఇంగ్లీష్
ఎ క్వైట్ ప్లేస్: డే వన్ (మూవీ) ఇంగ్లీష్
ఇన్ యువర్ డ్రీమ్స్ (మూవీ) ఇంగ్లీష్
ట్వింక్లింగ్ వాటర్‌మెలాన్ (మూవీ)కొరియన్
డ్రాగన్ బాల్జ్: సీజన్5 (వెబ్‌సిరీస్) జపనీస్




**అమెజాన్ ప్రైమ్:**

ఆర్ వీ గుడ్ (మూవీ) ఇంగ్లీష్ రెంటల్
బుల్ రన్ (మూవీ) ఇంగ్లీష్ రెంటల్

**జీ5: ఇన్‌స్పెక్షన్ బంగ్లా (మలయాళ సిరీస్)**

**ఈటీవీ విన్:**


ఏనుగుతొండం ఘటికాచలం (మూవీ) – తెలుగు
ఈగో (మూవీ) తెలుగు నవంబరు 16

**సన్‌నెక్ట్స్: ఎక్క (మూవీ) కన్నడ**

**హెచ్‌బీవో మ్యాక్స్:**

ఎడ్డింగ్టన్ (మూవీ) ఇంగ్లీష్

**మనోరమా మ్యాక్స్: కప్లింగ్ (మలయాళం)**



## పాపం రాశీఖన్నా.. ఎంత కష్టమొచ్చె!

ప్రముఖ నటి రాశీ ఖన్నా తన రాబోయే చిత్రం '120 బహదూర్' కోసం పడిన శ్రమను అభిమానులతో పంచుకున్నారు. ఫర్హాన్ అక్తర్‌తో కలిసి ఆమె నటించిన ఈ సినిమాలోని 'నైనా రా లోభి' అనే పాట చిత్రీకరణ వెనుక ఉన్న కష్టాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేశారు. సరైన షాట్ కోసం ఒకే లుక్‌ను మళ్లీ మళ్లీ రీక్రియేట్ చేయాల్సి వచ్చిందని, దాని కోసం చాలాసార్లు ముఖం కడుక్కోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ మేరకు తన ఫొటోలను షేర్ చేస్తూ, "ఈ లుక్ కోసం వాడిన రంగులు, హస్తకళ, సాంస్కృతిక వివరాలు నాకు చాలా ప్రత్యేకం. ఈ పాట చిత్రీకరణలో సరైన టేక్ కోసం ఎన్నిసార్లు ముఖం కడుక్కొని, మొత్తం లుక్‌ను తిరిగి రీక్రియేట్ చేశానో నాకే గుర్తులేదు. రంగుల వాడకం, లెక్కలేనన్ని రీసెట్లు ఉన్నప్పటికీ నా హెయిర్, మేకప్ టీం ప్రతి టేక్‌లోనూ ఎంతో ఓపికగా, పర్ఫెక్ట్‌గా పనిచేశారు" అని రాశీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన లుక్‌ను ఎంతో సహజంగా, అద్భుతంగా తీర్చిదిద్దిన తన మేకప్, హెయిర్, కాస్ట్యూమ్ డిజైన్ బృందానికి ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఒక మంచి అవుట్‌పుట్ వెనుక ఇంతమంది కృషి ఉంటుందని ఆమె అన్నారు. జావేద్ అలీ, అసీస్ కౌర్ ఆలపించిన 'నైనా రా లోభి' పాట ఒక అందమైన రొమాంటిక్ గీతం. ఇందులో ఫర్హాన్ అక్తర్, రాశీ ఖన్నా మధ్య కెమిస్ట్రీని చక్కగా చిత్రీకరించారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన '120 బహదూర్' చిత్రం, రెజాంగ్ లా సరిహద్దులో 120 మంది సైనికులు చూపిన వీరోచిత పోరాటం ఆధారంగా తెరకెక్కింది. రాజ్‌నీష్ 'రాజీ' ఘాయ్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ నవంబర్ 21న విడుదల కానుంది.






# బుమ్రా నిప్పులు

## తొలి రోజు భారత్‌దే.. 5 వికెట్లు తీసిన జస్‌ప్రీత్

## తోడుగా సిరాజ్, కుల్దీప్.. 159కే సౌతాఫ్రికా ఆలౌట్

**రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి మ్యాచ్ టీమిండియా పట్టుబిగించే దిశగా సాగుతోంది. కోల్‌కతా వేదికగా శుక్రవారం ప్రారంభమైన ఈ టెస్ట్‌లో భారత్ సమష్టిగా రాణించింది. దాంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 37 పరుగులు చేసింది.**

**ఓపెనర్ యశస్వి జైస్వాల్(12) విఫలమైనా.. కేఎల్ రాహుల్59 బంతుల్లో 2 ఫోర్లతో 13 బ్యాటింగ్), వాషింగ్టన్ సుందర్(38 బంతుల్లో 6 నాటౌట్) క్రీజులో ఉన్నారు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ ఒక వికెట్ తీసాడు. భారత్ ఇంకా 122 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌటైంది.**

ఓపెనర్లు ఎయిడెన్ మార్క్‌రమ్(48 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 31), వియాన్ మల్డర్(51 బంతుల్లో 3 ఫోర్లతో 24), ర్యాన్ రికెల్టన్(22 బంతుల్లో 4 ఫోర్లతో 23), టోనీ డీ జోర్జి(55 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా(5/27) ఐదు వికెట్లతో సఫారీ పతనాన్ని శాసించాడు. మహమ్మద్ సిరాజ్(2/47), కుల్దీప్ యాదవ్(2/36) రెండేసి వికెట్లు తీయగా.. అక్షర్ పటేల్ ఒక వికెట్ పడగొట్టాడు. టాస్ గెలిచిన బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు ఎయిడెన్ మార్క్‌రమ్(31), ర్యాన్ రికెల్టర్(23) శుభారంభం అందించారు. వన్డే తరహా బ్యాటింగ్‌తో దూకుడుగా ఆడిన ఈ జోడీ తొలి వికెట్‌కు 57 పరుగుల భాగస్వామ్యాన్ని అందించింది. క్రీజులో సెట్ అయిన ఈ జోడీని జస్‌ప్రీత్ బుమ్రా విడదీసాడు. ర్యాన్ రికెల్టన్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. తన మరుసటి ఓవర్‌లో మార్క్‌రమ్‌ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. కెప్టెన్ టెంబా బవుమా(3)ను కుల్దీప్ యాదవ్ పెవిలియన్ చేర్చగా.. టోనీ డీ జోర్జితో కలిసి వియాన్ మల్డర్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశాడు. దాంతో సౌతాఫ్రికా 105/3 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో భారత బౌలర్లు చెలరేగారు. వియాన్ మల్డర్‌ను కుల్దీప్ యాదవ్ వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. దాంతో నాలుగో వికెట్‌కు నమోదైన 43 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కైల్ వెర్రెన్(16), మార్కో జాన్సెన్(0)లను సిరాజ్ ఒకే ఓవర్‌లో ఔట్ చేయడంతో సౌతాఫ్రికాకు కోలుకోలేని దెబ్బ తగిలింది. కార్బిన్ బోచ్(5)ను అక్షర్ పటేల్ వికెట్ల ముందు బోల్తా కొట్టించగా సౌతాఫ్రికా 154/8తో టీ బ్రేక్ వెళ్లింది. మూడో సెషన్ ఆరంభంలోనే మూడు బంతుల వ్యవధిలోనే సిమన్ హర్మర్(5), కేశవ్ మహరాజ్(0)లను బుమ్రా ఔట్ చేసి సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్(12) తీవ్రంగా నిరాశపర్చాడు. మూడు ఫోర్లతో జోరు కనబర్చిన అతన్ని మార్కో జాన్సెన్ క్లీన్ బౌల్డ్ చేశాడు. క్రీజులోకి వచ్చిన సుందర్‌తో కలిసి కేఎల్ రాహుల్ మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డాడు. కొత్త బంతితో సఫారీ పేసర్లు చెలరగడంతో భారత బ్యాటర్లు ఆచితూచి ఆడారు. జిడ్డు బ్యాటింగ్‌తో వికెట్లను కాపాడుకున్నారు. ముఖ్యంగా రాహుల్ అసలు సిసలు టెస్ట్ బ్యాటింగ్‌తో బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచాడు. మరోవైపు సుందర్ సైతం అదే తరహాలో ఇన్నింగ్స్‌కు అడ్డుగోడలా నిలిచాడు. వెలుతురు లేమి కారణంగా అంపైర్లు త్వరగానే తొలి రోజు ఆటను ముగించారు.

## బుమ్రా సలహాతోనే వికెట్లు: సిరాజ్

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా సలహాతోనే రెండు వికెట్లు తీసానని మహమ్మద్ సిరాజ్ తెలిపాడు. స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేయాలని బుమ్రానే సూచించాడని చెప్పాడు. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి మ్యాచ్‌లో మహమ్మద్ సిరాజ్(2/47) రెండు వికెట్లు పడగొట్టాడు. తొలి రోజు ఆట అనంతరం బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన సిరాజ్.. వికెట్ కండిషన్స్ గురించి చెప్పుకొచ్చాడు. పిచ్‌లో ఒక ఎండ్‌లో బ్యాటింగ్ చేయడం కష్టంగా ఉందని తెలిపాడు. 'కొత్త బంతి బ్యాట్‌పైకి మంచిగా వచ్చింది. కానీ బంతి పాతబడినప్పుడు బౌన్స్ తగ్గింది. దాంతో నేను ఫుల్ లెంగ్త్‌లో స్టంప్ లైన్‌లో బౌలింగ్ చేయాలనుకున్నాను. కొంత రివర్స్ స్వింగ్ కూడా లభించింది. ఎప్పుడైనా వికెట్ టు వికెట్ బౌలింగ్ చేస్తే.. వికెట్లు లభించే అవకాశాలు ఉంటాయి. బ్యాటర్లకు కూడా పరుగులు చేయడం ఇబ్బంది అవుతుంది. ఈ పిచ్‌లో ఒక ఎండ్‌లో బ్యాటింగ్ చేయడానికి బాగానే ఉంది. కానీ మరొక ఎండ్‌లో అనూహ్య బౌన్స్ ఉంది. పరుగులు చేయడం కష్టంగా మారింది. జస్సీ భాయ్ నాకు చెప్పింది ఏంటంటే.. స్టంప్స్ లైన్‌లో బౌలింగ్ చేస్తే వికెట్ దొరుకుతుంది. బ్యాటర్లు ఎల్బీడబ్ల్యూ, బౌల్డ్ అయ్యే అవకాశం ఉండటంతో పాటు కచ్చితమైన లైన్‌లో వేస్తే క్యాచ్‌లు కూడా వస్తాయని బుమ్రా చెప్పాడు. ఈ మ్యాచ్‌లో మేం పట్టు బిగిస్తున్నాం.కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయాం. మార్క్‌రమ్, రికెల్టన్ మంచి భాగస్వామ్యం నెలకొల్పారు. కానీ మేం పుంజుకొని ఆ భాగస్వామ్యాన్ని విడదీసాం. ప్రస్తుతం మేం ఈ మ్యాచ్‌లో ముందంజలో ఉన్నామని నేను అనుకుంటున్నా.'అని మహమ్మద్ సిరాజ్ చెప్పుకొచ్చాడు.



## ఫైనల్‌లోనే టాస్ గెలుస్తానేమో

టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభమాన్ గిల్ కు బ్యాడ్ లక్ కొనసాగుతోంది. బ్యాటర్ గా అత్యుత్తమంగా ఆడుతున్నా.. కెప్టెన్సీలో అదరగొడుతున్నా ఒక విషయంలో మాత్రం గిల్ కు అదృష్టం కలిసి రావడం లేదు. కెప్టెన్ గా గిల్ టాస్ గెలవడంతో విఫలమవుతున్నాడు కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గిల్ ఇప్పటివరకు 11 మ్యాచ్ ల్లో ఒకసారి మాత్రమే టాస్ గెలిచాడు. ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ లో తొలిసారి టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన గిల్..స్వదేశంలో వెస్టిండీస్ తో జరిగిన రెండో టెస్టులో మాత్రమే టాస్ గెలిచాడు. ఇంగ్లాండ్ తో ఐదు టెస్టుల్లో టాస్ ఓడిన గిల్.. ఆ తర్వాత వెస్టిండీస్ తో జరిగిన రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో ఒక టెస్టులో టాస్ గెలిచాడు. వన్డే కెప్టెన్ అయ్యాక ఆస్ట్రేలియా టూర్ లో మూడు వన్డేల్లో టాస్ ఓడిన ఈ యువ సారధి.. ప్రస్తుతం సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులోనూ టాస్ గెలవలేకపోయాడు. దీంతో టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి టాస్ ఓడిపోవడంపై గిల్ ను ప్రశ్నించాడు. శాస్త్రి అడిగిన ప్రశ్నకు గిల్ నిరాశలో చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. " నేను వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్లో టాస్ గెలవాలని ఆశిస్తున్నా". అని సమాధానమిచ్చాడు.





## అల్కరాజ్‌దే నం.1

ఈ ఏడాది టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో నంబర్ వన్ ర్యాంకుతో ముగించాలనుకున్న స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాజ్ అనుకున్నది సాధించాడు. ఇటలీలో జరుగుతున్న ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో అల్కరాజ్.. పురుషుల సింగిల్స్ గ్రూప్ స్టేజ్ ఆఖరి మ్యాచ్‌లో 6-4, 6-1తో లొరెంజొ ముసెట్టి(ఇటలీ)ని ఓడించడం ద్వారా ఈ ర్యాంకును దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ టైటిల్ దిశగా దూసుకుపోతున్నా అల్కరాజ్‌కు మూడు విజయాలు అవసరం ఉండగా మూడింటినీ గెలుచుకుని అగ్రస్థానం సాధించాడు.

## షమీకి క్లారిటీ ఇవ్వాలి: పుజారా

టీమ్‌ఇండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమీ చాలాకాలంగా జట్టుకు దూరంగా ఉంటున్నాడు. ముఖ్యంగా అతడు టెస్టుల్లో టీమ్‌ఇండియా తరఫున చివరిసారిగా ఓవల్ వేదికగా జరిగిన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మ్యాచ్ 2023లో కనిపించాడు. తర్వాత అతడు జట్టులో స్థానం కోల్పోయాడు. ఇంగ్లాండ్ సిరీస్‌లోనూ అతడు ఆడలేదు. మహ్మద్ షమీ ఫిట్‌నెస్ విషయంలో తనకు అప్‌డేట్ లేదని బీసీసీఐ చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఇటీవల అన్నాడు. అయితే భారత జట్టుకు ఎంపిక విషయంలో షమీకి సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ క్లారిటీ ఇవ్వాలని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పుజారా అన్నాడు. పేసర్ల విషయంలో భవిష్యత్తు ప్రణాళిక గురించి అతడికి తెలపాలని సూచించాడు. 'మహ్మద్ షమీ లాంటి బౌలర్‌తో సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ నిజాయతీగా వ్యవహరించాలి. వాళ్లు ఏ ప్రణాళికతో ముందుకు వెళ్లాలనుకుంటున్నారో వివరించాలి. జట్టులోకి షమీని తీసుకునే అవకాశం ఉందా? లేక వారు యువ బౌలర్లకు ఛాన్స్ ఇవ్వాలనుకుంటున్నారా?.. అనే విషయాన్ని స్పష్టంగా తెలపాలి' అని పుజారా అన్నాడు. 'ఒకవేళ షమీకి ఏ విషయం అనేది తేల్చి చెబితే.. అతడు దేశవాళీల్లో ఆడాలా? లేదా? అనే విషయంలో ఓ నిర్ణయానికొస్తాడు. అలాగే ఐపీఎల్‌పై దృష్టిపెడతాడు'






## లఖ్‌నవూకు షమీ!

సన్‌రైజర్స్ హైదరాబాద్ మహ్మద్ షమీని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ఇచ్చేందుకు అంగీకరించినట్లు వార్తలొస్తున్నాయి. ఇది ప్లేయర్ టూ ప్లేయర్ ట్రేడ్ కాదట. ఈ వ్యవహారం మొత్తం నగదు లావాదేవీల్లో జరగనుందట. 2025 మెగా వేలంలో షమీని రూ.10 కోట్లకు సన్‌రైజర్స్ కొనుగోలు చేసింది. ఇప్పుడు లఖ్‌నవూ అంతే మొత్తం చెల్లించి షమీని తీసుకుంటుందని సమాచారం. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సోషల్ మీడియాలో తాజాగా పెట్టిన ఓ పోస్టు వైరల్‌గా మారింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో బెన్ స్టోక్స్‌ని షమీ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఈ ఫొటోను ఎల్ఎస్‌జీ సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ 'ఏ కారణం లేకుండా ఈ ఏకనా (స్టేడియం) మూమెంట్ గురించి ఆలోచిస్తున్నాను' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో వచ్చే సీజన్‌లో షమీ లఖ్‌నవూకు ఆడుతున్నాడని ఆ జట్టు చెప్పకనే చెప్పిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## కేకేఆర్ బౌలింగ్ కోచ్‌గా టిమ్ సౌథీ

తమ కొత్త బౌలింగ్ కోచ్‌గా టిమ్ సౌథీని కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం నియమించుకుంది. ఈ విషయాన్ని ఆ ఫ్రాంఛైజీ శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు భరత్ అరుణ్ కోల్‌కతాకు బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించాడు. అలాగే కోల్‌కతా నైట్ రైడర్స్ ఇటీవలే చంద్రకాంత్ పండిత్ స్థానంలో అభిషేక్ నాయర్‌ను హెడ్ కోచ్‌గా, షేన్ వాట్సన్‌ను సహాయక కోచ్‌గా నియమించుకున్న విషయం తెలిసిందే. మెంటార్‌గా బ్రావో కొనసాగుతున్నాడు. 'కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తిరిగి కలిసి పనిచేయడం నాకు గౌరవంగా ఉంది. ఈ ఫ్రాంఛైజీకి ఘనమైన చరిత్ర, పెద్దసంఖ్యలో అభిమానులు, అద్భుతమైన ఆటగాళ్లు ఉన్నారు. నేను బౌలర్లతో కలిసి మా జట్టు ఐపీఎల్ 2026లో విజయం సాధించేందుకు కృషి చేస్తా' అని సౌథీ అన్నాడు. 'మేము సౌథీకి ఘన స్వాగతం పలుకుతున్నాం. అతడి అనుభవం మా జట్టు బౌలింగ్ విభాగానికి ఎంతో ఉపయోగపడుతుంది. అతడి నాయకత్వ లక్షణాలు మా యువ బౌలర్లకు మార్గనిర్దేశనం చేస్తాయి' అని కోల్‌కతా నైట్ రైడర్స్ సీఈఓ వెంకీ మైసూర్ పేర్కొన్నాడు.




## 32 బంతుల్లోనే సెంచరీ!

**ఆసియా కప్‌లో వైభవ్ సూర్యవంశీ ఊచకోత**

ఐపీఎల్‌లో మెరుపు సెంచరీతో వార్తల్లో నిలిచిన వైభవ్ సూర్యవంశీ మళ్లీ చెలరేగిపోయాడు. అండర్ -19 విభాగంలో రెచ్చిపోయి ఆడుతున్న ఈ యంగ్‌స్టర్ అసియాకప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో ఊచకోతకు తెగబడ్డాడు. ఓపెనర్‌గా వచ్చిన వైభవ్ యూఏఈ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ 32 బంతుల్లోనే శతకగర్జన చేశాడు. ఆకాశమే హద్దుగా దంచేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ 10 ఫోర్లు, 9 సిక్సర్లతో మూడంకెల స్కోర్ అందుకున్నాడు. జూనియర్ క్రికెట్‌లో సంచలనంగా పేరొందిన వైభవ్ సూర్యవంశీ మరో రికార్డు బద్ధలు కొట్టాడు. ఏసీసీ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో వీరబాదుడుతో యూఏఈపై శతకం సాధించాడు. పురుషుల టీ20ల్లో భారత్ తరఫున మూడో వేగవంతమైన శతకం నమోదు చేశాడు. దొరికిన బంతినల్లా బౌండరీకి పంపిన ఈ చిచ్చరపిడుగు.. వెస్టిండీస్ వెటరన్ క్రిస్ గేల్ అత్యధిక స్కోర్‌ను అధిగమించేలా కనిపించాడు. కానీ, వైభవ్ 144 వద్ద ఔట్ కావడంతో గిల్ రికార్డు అలానే ఉండిపోయింది. ఐపీఎల్ 18వ సీజన్ నుంచి వైభవ్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఓపెనర్‌గా అదరకబెదరక సిక్సర్ల వాన కురిపించే అతడు క్రీజులో ఉన్నాడంటే బౌలర్లు జడుస్తున్నారు. పన్నెండేళ్లకే రంజీల్లో అరంగేట్రం చేసిన వైభవ్‌ను ఆ ఎడిషన్ మెగా వేలంలో రాజస్థాన్ రాయల్స్ సొంతం చేసుకుంది. రూ.1.5 కోట్లకు రాజస్థాన్ శిబిరంలో చేరిన ఈ కుర్రాడు తన బ్యాటింగ్‌ను సానబెట్టుకున్నాడు. కెప్టెన్ సంజూ శాంసన్ గాయపడడంతో లక్నోతో మ్యాచ్‌లో వైభవ్‌కు ఓపెనర్‌గా అవకాశం వచ్చింది. తొలి మ్యాచ్‌లోనే 35 పరుగులతో ఆకట్టుకున్న ఈ చిచ్చరపిడుగు.. ఆ తర్వాత గుజరాత్ టైటాన్స్‌పై సెంచరీతో గర్జించాడు.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 15-11-2025
www.evarthalu.com



# సంతానలేమి.. ఎవరిది సమస్య?

సంతానలేమి సమస్య చాలామందిని మానసికంగా కుంగిపోయేలా చేస్తుంది. పిల్లలు పుట్టకపోవడానికి కారణాలు ఆడవారిలో మాత్రమే ఉంటాయని చాలామంది తప్పుగా అర్థం చేసుకుంటారు. సంతానలేమికి కారణాలు పురుషులలో, స్త్రీలలో లేదా ఇద్దరిలో ఉండవచ్చు. భారతదేశంలో ప్రతీ 100 మందిలో దాదాపుగా 4 నుండి 16 మంది వరకు సంతానలేమి సమస్యలను ఎదుర్కొంటున్నారు. పురుషులలో సంతానలేమికి (వంధ్యత్వానికి) అనేక కారణాలు ఉన్నాయి. ప్రధానంగా శుక్రకణాల (స్పెర్మ్) ఉత్పత్తి మరియు వాటి నాణ్యత, అలాగే శుక్రకణాలు రవాణా అయ్యే మార్గంలో సమస్యలు కారణంగా ఈ సమస్య వస్తుంది. స్త్రీలలో 35 తర్వాత, పురుషులలో 40-45 తర్వాత సంతానోత్పత్తి తగ్గుతుంది. ధూమ-పానం స్త్రీలలో అండాల నాణ్యతను తగ్గిస్తుంది మరియు అండాశయం వేగంగా వృద్ధాప్యం చెందేలా చేస్తుంది.



పురుషులలో శుక్రకణాల సంఖ్యను, చలనశీలతను తగ్గించి, వాటి డీఎన్ఏను దెబ్బతీస్తుంది, తద్వారా ఫలదీకరణం మరియు ఆరోగ్యకరమైన గర్భధారణ అవకాశాలను తగ్గిస్తుంది. మద్యపానం కూడా స్త్రీలలో హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీసి, అండం విడుదల (ఓవ్యులేషన్) ప్రక్రియను అడ్డుకుంటుంది. పురుషులలో టెస్టోస్టెరాన్ స్థాయిలను తగ్గించి, శుక్రకణాల సంఖ్య, చలనశీలత మరియు నాణ్యతను తీవ్రంగా తగ్గిస్తుంది.అధికంగా తాగేవారిలో గర్భం దాల్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. గర్భస్రావం అయ్యే ప్రమాదం పెరుగుతుంది. స్థూలకాయం లేదా తీవ్రమైన తక్కువ బరువు హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. అధిక మానసిక ఒత్తిడి హార్మోన్లను అస్తవ్యస్తం చేస్తుంది. సుమారు 10% జంటలలో, అన్ని పరీక్షలు సాధారణంగా ఉన్నప్పటికీ, సంతానలేమికి కారణం స్పష్టంగా తెలియకపోవచ్చు.

## 1.శుక్రకణాల సమస్యలు:

తక్కువ శుక్రకణాల సంఖ్య: అండంను ఫలదీకరణం చేయడానికి తగినంత శుక్రకణాలు లేకపోవడం. కొన్ని సందర్భాలలో, అసలు శుక్రకణాలు ఉత్పత్తి కాకపోవడం (అజూస్పెర్మియా) కూడా సంభవించవచ్చు.

పేలవమైన శుక్రకణ చలనశీలత: శుక్రకణాలు సరిగ్గా కదలలేకపోవడం లేదా ఈదలేకపోవడం. అండం ను చేరుకోవడానికి, శుక్రకణాలు చురుకుగా కదలగలగాలి.

అసాధారణ శుక్రకణ ఆకారం: శుక్రకణాలు సాధారణ ఆకారం (చేపపిల్ల ఆకారం) లో లేకపోవడం, ఇది అండంను ఫలదీకరణం చేయడంలో కష్టతరం చేస్తుంది.

శుక్రకణ డీఎన్ఏ దెబ్బతినడం: శుక్రకణంలో జన్యుపదార్థం దెబ్బతినడం.

## 2. నిర్మాణపరమైన సమస్యలు

వరికోసెల్స్: వృషణాల నుండి రక్తాన్ని తీసుకెళ్లే సిరలు ఉబ్బడం. ఇది వృషణాలలో ఉష్ణోగ్రతను పెంచి, శుక్రకణాల ఉత్పత్తి మరియు నాణ్యతను ప్రభావితం చేయవచ్చు. పురుషులలో సంతానలేమికి ఇది సర్వసాధారణంగా చికిత్స చేయదగిన కారణం.

శుక్రకణ రవాణాలో అడ్డంకులు: ఎపిడిడైమిస్ (శుక్రకణాలను నిల్వ చేసే గొట్టం), వాస్ డిఫరెన్స్ (శుక్రకణాలను తీసుకెళ్లే గొట్టం) లేదా ఇతర మార్గాలలో అడ్డంకులు ఏర్పడటం వల్ల శుక్రకణాలు బయటకు రాకుండా ఆగిపోతాయి. ఇన్ఫెక్షన్లు, గాయాలు లేదా శస్త్రచికిత్సల (ఉదాహరణకు, వాసెక్టమీ) కారణంగా ఇవి సంభవించవచ్చు.

అండెస్సెండెడ్ టెస్టికల్స్: పిండ దశలో వృషణాలు ఉదరం నుండి వృషణాల సంచిలోకి (స్క్రోటమ్) దిగకపోవడం. దీనివల్ల వృషణాల ఉష్ణోగ్రత పెరిగి శుక్రకణాల ఉత్పత్తి తగ్గుతుంది.

## 4. స్కలనం సమస్యలు:

రెట్రోగ్రేడ్ స□లనం: స్కలనం సమయంలో వీర్యం మూత్రాశయంలోకి వెళ్లడం, బయటకు రాకపోవడం. మధుమేహం, వెన్నెముక గాయాలు, కొన్ని మందులు లేదా శస్త్రచికిత్సల వల్ల ఇది సంభవించవచ్చు.

స□లనం చేయడంలో అసమర్థత: కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా మందుల కారణంగా స□లనం అస్సలు జరగకపోవడం.

## 5. ఇన్ఫెక్షన్లు, వ్యాధులు:

లైంగిక సంక్రమణ వ్యాధులు: క్లామిడియా లేదా గోనేరియా వంటివి శుక్రకణ మార్గాల్లో అడ్డంకులను సృష్టించవచ్చు లేదా శుక్రకణ నాణ్యతను దెబ్బతీస్తాయి.

వృషణాల లేదా ఎపిడిడైమిస్ వాపు: గవదబిళ్లలు వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు వృషణాలను దెబ్బతీస్తాయి.


స్పెర్మ్‌పై ప్రతిరోధకాలు: రోగనిరోధక వ్యవస్థ శుక్రకణాలను విదేశీ కణాలుగా గుర్తించి వాటిని నాశనం చేయడానికి ప్రయత్నించడం.

## 6. జన్యుపరమైన కారణాలు:

క్రోమోజోమ్ సమస్యలు: క్లైన్‌ఫెల్టర్ సిండ్రోమ్ (అదనపు 'ఎక్స్' క్రోమోజోమ్ ఉండటం) వంటివి.

వై క్రోమోజోమ్‌లో మైక్రోడిలెషన్స్: శుక్రకణ ఉత్పత్తికి సంబంధించిన జన్యువులు వై క్రోమోజోమ్‌లో లేకపోవడం.

సిస్టిక్ ఫైబ్రోసిస్ మ్యుటేషన్స్: కొన్ని సందర్భాల్లో, శుక్రకణ రవాణా మార్గాల్లో అడ్డంకులు లేదా వాస్ డిఫరెన్స్ లేకపోవడానికి కారణమవుతాయి.




## 7. జీవనశైలి, పర్యావరణ కారకాలు:

ఆరోగ్య సమస్యలు: అధిక రక్తపోటు, మధుమేహం వంటివి.

స్థూలకాయం: హార్మోన్ల సమతుల్యతను ప్రభావితం చేస్తుంది.

ధూమపానం, మద్యపానం: శుక్రకణాల నాణ్యతను తగ్గిస్తాయి.

కొన్ని మందులు: కీమోథెరపీ మందులు, టెస్టోస్టెరాన్ సప్లిమెంట్లు మొదలైనవి.

రేడియేషన్‌కు గురికావడం: పర్యావరణ కాలుష్యం లేదా వృత్తిపరమైన రేడియేషన్.


వృషణాలకు అధిక ఉష్ణోగ్రత: వేడి స్నానాలు, బిగుతైన లోదుస్తులు, ఎక్కువసేపు ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకోవడం.

సంతానలేమికి చికిత్స: సంతానలేమికి కారణాన్ని బట్టి చికిత్స ఉంటుంది. చికిత్స విధానంలో సాధారణంగా మందుల ద్వారా మొదలుపెట్టి, అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స లేదా అధునాతన సంతానోత్పత్తి పద్ధతులను ఉపయోగిస్తారు. మందులు, శస్త్రచికిత్సలు పనిచేయనప్పుడు లేదా తీవ్రమైన సంతానలేమి సమస్యలు ఉన్నప్పుడు ఇంట్రా-యుటెరైన్ ఇన్సెమినేషన్, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్, ఇంట్రాసైటోప్లాస్మిక్ స్పర్మ్ ఇంజెక్షన్ ద్వారా చికిత్స అందిస్తారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

సంతానలేమి సమస్య రాకుండా లేదా సంతానోత్పత్తి అవకాశాలను పెంచడానికి స్త్రీలు, పురుషులు ఇద్దరూ పాటించాలి.

1. ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం
2. ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాల అలవాట్లకు దూరంగా ఉండటం
3. ఒత్తిడిని నియంత్రించడం
4. సమతుల్య ఆహారం తీసుకోవడం



### పురుషులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- వృషణాల ఉష్ణోగ్రతను నియంత్రించడం: వృషణాలకు అధిక వేడి తగలడం శుక్రకణాల ఉత్పత్తిని తగ్గిస్తుంది. కాబట్టి, వేడి నీటి స్నానాలు, సావూనాలకు దూరంగా ఉండాలి మరియు బిగుతుగా ఉండే లోదుస్తులకు బదులుగా వదులుగా ఉండే లోదుస్తులను ధరించడం మంచిది.
- కంప్యూటర్లు/ల్యాప్‌టాప్‌లను ఒడిపై ఉంచుకోకపోవడం: వీటి నుండి వచ్చే వేడి కూడా శుక్రకణాలపై ప్రభావం చూపుతుంది.
- పర్యావరణ కాలుష్యాల నుండి రక్షణ: పురుగుమందులు, హెవీ మెటల్స్ లేదా పారిశ్రామిక రసాయనాలకు గురికాకుండా జాగ్రత్త వహించాలి.

### స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

- రుతుచక్రాన్ని ట్రాక్ చేయడం: మీ రుతుచక్రం ఎప్పుడు జరుగుతుందో మరియు అండం విడుదల ఎప్పుడు అవుతుందో తెలుసుకోవడం గర్భధారణకు సరైన సమయాన్ని గుర్తించడంలో సహాయపడుతుంది.
- లైంగికంగా సంక్రమించే వ్యాధుల నుండి రక్షణ: క్లామిడియా వంటి లైంగికంగా సంక్రమించే వ్యాధులు ఫాలోపియన్ ట్యూబ్‌లను దెబ్బతీసి సంతానలేమికి కారణమవుతాయి. సురక్షితమైన పద్ధతులు పాటించడం ముఖ్యం.
- క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు: ఏదైనా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య (థైరాయిడ్, డయాబెటిస్, పీసీఓఎస్ వంటివి) ఉంటే, అవి సంతానోత్పత్తిని ప్రభావితం చేయకుండా ఉండేందుకు వైద్యుల సలహా మేరకు వాటిని నియంత్రణలో ఉంచుకోవాలి.


### రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

ఇట్లు
- ఎడిటర్

---------------------------

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.